RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 102 మంగళవారం, మే 21, 2024 పేజీలు : 4

## హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారు : భవానీరెడ్డి

హైదరాబాద్: ఎమ్మెల్యే హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, పదేళ్ల పాలనలో ప్రజలు చీదరించుకున్నారని పిసిసి అధికార ప్రతినిధి భవానీరెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తగూడెంలో రైతులకు బేడీలు వేసింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వలేని అసమర్ధ పాలన కెసిఆర్‌దని, ప్రజలకి సుపరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ వరకు 2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## బిజెపి దక్షిణాదిన భారీగా గెలుస్తుంది



భువనేశ్వర్ : భారతీయ జనతా పార్టీ (బిజెపి) దక్షిణాదిన అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడినప్పుడు తమ ఎన్‌డిఎ కూటమి లోక్‌సభలో 400 పైగా సీట్లు గెలుచుకుంటుందని ప్రధాని మోడీ మళ్లీ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ పిటిఐ వీడియోస్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, 'సమస్త దేశానికి మా వ్యూహం ఒకటే. ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్, ఔర్ చార్ జూన్ 400 పార్' (మళ్లీ మోడీ సర్కార్, ఇంకా జూన్ 4న 400 పైగా సీట్లు)' అని చెప్పారు. బిజెపికి దక్షిణాదిన బలం గాని, ఉనికి గాని లేదనే అపోహను తమ ప్రత్యర్థులు సృష్టించారని మోడీ ఆరోపించారు. '2019 ఎన్నికలను పరికించండి. అప్పుడూ దక్షిణాదిన అతిపెద్ద పార్టీ బిజెపినే. మళ్లీ ఇదే చెబుతున్నా.

ఈ దఫా దక్షిణాదిన అతిపెద్ద పార్టీగా బిజెపి కాగలదు. దాని మిత్ర పక్షాలు మరిన్ని (సీట్లు) చేరుస్తాయి' అని ఆయన తెలిపారు. 'మేము దక్షిణ భారత్‌లో ఏకైక పెద్ద పార్టీ కాగలం. క్రితం సారి కన్నా కూడా భారీ ఆధిక్యం సాధిస్తాం. మేము ఇప్పటికే ప్రజల మనస్సుల్లో భారీ వాటా సాధించాం. ఆ ప్రాంతంలో సీట్ల వాటాలో, వోట్ల వాటాలో పెద్ద పురోగతి చూస్తాం' అని మోడీ చెప్పారు. 543 లోక్‌సభ సీట్లలో 131 సీట్లు దక్షిణ భారత్‌వే. ఇప్పుడు పదవీ కాలం ముగియనున్న లోక్‌సభలో దక్షిణాది నుంచి బిజెపికి 29 మంది సభ్యులు ఉన్నారు. అంతే కాకుండా బిజెపి మద్దతు ఇచ్చిన, కర్నాటక నుంచి ఒక స్వతంత్ర సభ్యుడు ఉన్నారు. తుదకు తూర్పు భారతంలో కూడా 'ప్రజల నుంచి బృహత్ స్థాయిలో మద్దతు చూస్తున్నాం & దీని వల్ల భువనేశ్వర్‌లో, కోల్‌కతాలో, చివరకు ఢిల్లీలో కూడా మీడియా, రాజకీయ వర్గాల్లో కొందరికి నిద్ర లేని రాత్రులు ఉంటున్నాయి' అని మోడీ తెలిపారు.

కొన్ని సంవత్సరాల క్రితం తూర్పు భారతంలో అభివృద్ధి లోటు గురించి ఒక సవివరణ పత్రాన్ని ఎలా ఉపయోగించుకున్నదీ మోడీ గుర్తు చేసుకుంటూ, ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ ప్రాంతానికి సాధికారత కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేసిందని తెలియజేశారు. తత్ఫలితంగా గత దశాబ్దంలో బిజెపి ప్రభుత్వం, ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంత మార్పు తీసుకురాగలదో ఆ ప్రాంతం చూసిందని ఆయన చెప్పారు. 'ఈ ఎన్నికల్లో 'ఎర్ర కారిడార్'గా పేర్కొంటున్న ప్రాంతం 'కాషాయ కారిడార్' కాగలదు' అని ఆయన సూచించారు. గత ఎన్నికల దశలపై మదింపులు అన్నీ ఎన్‌డిఎ 'ధ్రువ స్థానంలో' ఉన్నట్లు, కాంగ్రెస్ తన ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో పాటు కొన్ని రాష్ట్రాల్లో ఖాతా తెరవడానికీ ఇబ్బంది పడుతున్నట్లు సూచిస్తున్నాయని ప్రధాని తెలియజేశారు. ప్రజల ఆశీస్సులు మాకు రికార్డు స్థాయి తీర్పు ఇవ్వగలవు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి, ముఖ్యంగా దక్షిణాది, తూర్పు ప్రాంతం నుంచి మాకు మరిన్ని సీట్లు రాగలవు' అని మోడీ ధీమా వ్యక్తం చేశారు. '400 సీట్లు సాధించే దశలో ఎన్‌డిఎ ఉంది' అని ప్రధాని తెలిపారు. 'తొలి రోజు నుంచి మా భౌగోళిక అస్తిత్వం పరంగానే కాకుండా మా సిద్ధాంతం పరంగా కూడా' బిజెపి సిసలైన జాతీయ పార్టీ అని మోడీ స్పష్టం చేశారు.

'మాకు దేశం మొదట అనేది మా సిద్ధాంతానికి పునాది. బెంగాల్‌కు లేదా కేరళకు సంబంధించి మేము నిర్ణయాలు తీసుకుంటే అందుకుదేశం మొదట అనేది ప్రాతిపదిక అవుతుంది' అని ఆయన చెప్పారు. జాతీయ ఫలితాల గురించిన ప్రశ్నకు మోడీ సమాధానం ఇస్తూ, '400 దాటాలని మేము నిశ్చయించుకున్నాం. నాలుగు దశల ఎన్నికల తరువాత మా అంచనా సరైనదే అని దృఢవిశ్వాసంతో చెప్పగలను. మా అంచనాకు మించి ప్రజల దృఢనిర్ణయం మరింత బలంగా ఉంది' అని చెప్పారు. దక్షిణాదిలో బిజెపి దుర్బలం అన్న కథనం పార్టీని పట్టణ ప్రాంత ప్రాధాన్య, పురుషుల ప్రాధాన్య, ఉత్తరాది ప్రాధాన్య, 'బనియా బ్రాహ్మణ' పార్టీగా చిత్రించిన ప్రచారంలో భాగం అని ప్రధానిపేర్కొన్నారు.

'ఒక అపోహను వ్యాప్తి చేశారు. జాతిని తప్పుదారి పట్టించేందుకు, దేశాన్ని నాశనం చేసేందుకు రకరకాల అపోహలు సృష్టిస్తున్న వాతావరణం మన దేశంలో సంవత్సరాలుగా సాగుతోంది' అని ఆయన ఆరోపించారు. 'మాది బనియా బ్రాహ్మణ పార్టీ అని కూడా పేర్కొన్నార. కానీ అధిక సంఖ్యాక దళిత, ఒబిసి, ఆదివాసీ ఎంపి/ ఎంఎల్ఎలు బిజెపి నుంచే ఉన్నారు. వారు దీనిని ఉద్దేశపూర్వకంగా చేస్తుంటారు. మాకు దక్షిణాదిన ఉనికి లేదనే అపోహను అదే విధంగా వ్యాప్తి చేశారు' అని మోడీ చెప్పారు.

## ఆప్‌కు రూ. 7 కోట్లకు పైగా విదేశీ నిధులు





న్యూఢిల్లీ : ఢిల్లీ, పంజాబ్‌లను పాలిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎఫ్‌సిఆర్ఎకు విరుద్ధంగా రూ. 7 కోట్లకు పైగా విదేశీ నిధులు అందుకుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఎ)కు లేఖ రాసినట్లు అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. పంజాబ్ మాజీ ఆప్ఎంఎల్ఎల సుఖ్‌పాల్ సింగ్ ఖైరాపైన, మరికొందరిపైన డ్రగ్స్‌తో ముడిపడిన మనీ లాండరింగ్ దర్యాప్తు సమయంలో తాను కొన్ని డాక్యుమెంట్లు, ఇమెయిల్స్ స్వాధీనం చేసుకున్న తరువాత ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఇడి ఎంహెచ్ఎకు ఆ లేఖ పంపింది. ఇడి ఈ దర్యాప్తును 2021లో ప్రారంభించింది. అదే సంవత్సరం ఖైరాను ఇడి అరెస్టు చేసింది. ఖైరా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో ఉన్నారు. ఆప్ ఉల్లంఘనలను వివరిస్తూ, విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ), ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పిఎ)లకు అవి విరుద్ధమైనవిగా పేర్కొంటూ ఇడి కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖకు ఒక సమగ్ర సమాచార పత్రాన్ని పంపినట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఈ కేసులో తాజా వివరాలు కొన్నిటిని ఎంహెచ్ఎతో ఇడి ఇటీవల పంచుకున్నట్లు తెలుస్తోంది. ఆప్ ఇప్పటి వరకు దాదాపు రూ. 7.08 కోట్ల మేరకు విదేశీ విరాళాలు స్వీకరించిందని, కొన్ని ఇతర వివరాలతో పాటు విదేశీ దాతల పేర్లు, జాతీయతలను ఆ పార్టీవారు 'తప్పుగా వెల్లడించారు, వక్రీకరించారు' అని ఇడి కనుగొన్నదని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, ఎఫ్‌సిఆర్ఎ ఉల్లంఘనల కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) దర్యాప్తు చేస్తుంటుందని, ఇడి చేసిన ఆ ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ సిబిఐకి హోమ్ మంత్రిత్వశాఖ లేఖ రాయగలదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

## కాంగ్రెస్ బోనస్... పెద్ద బోగస్..

## మండిపడ్డ హరీశ్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ బోనస్ పెద్ద బోగస్ అని.. సర్కారు మరో ఎన్నికల హామీని తుంగలో తొక్కిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి, తాము ఆ మాట అనలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు వడ్లకు బోనస్ ఇచ్చే విషయంలో పచ్చి అబద్ధాలాడి రైతులను మోసం ఆరోపించారు. రైతులు పండించిన వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చిందని.. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుతుందని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు తాము పండించిన పంటను అమ్మకానికి సిద్ధపడి బోనస్ కోసం ఎదురు చూస్తుండగా.. వారందరి ఆశలు అడియాసలు చేస్తూ కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని.. అది కూడా వచ్చే సీజన్ నుంచి ఇస్తామని మంత్రులు ప్రకటించడం అత్యంత బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 90శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని.. పది శాతం పండే సన్న వడ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరకంటే చాలా అధికంగా మార్కెట్‌లో ధర వస్తుందని తెలిపారు. కానీ, దొడ్డు రకం బియ్యానికే గిట్టుబాటు ధర రాదన్నారు. కాబట్టి బోనస్ ఇవ్వాల్సింది దొడ్డు రకం వడ్లకేనన్నారు. అలా కాకుండా కేవలం సన్న రకాలకే బోనస్ ఇస్తాం.. అదీ వచ్చే సీజన్ నుంచి ఇస్తామనడం రైతులను దగా చేయడమేనన్నారు. తాజాగా మంత్రుల ప్రకటనతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమంపై, వ్యవసాయాభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టమైపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో ఇచ్చినవే తప్ప రైతుల మేలు కోసం చేసే కార్యక్రమాలు కావని తేలిపోయిందన్నారు. ఎకరానికి రూ.15వేల రైతు భరోసా సాయం ఇస్తామని, వ్యవసాయ కూలీలకు రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామనే హామీలను కూడా ప్రభుత్వం ఇప్పటి దాకా అమలు చేయని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రూ.2లక్షల రుణమాఫీ గురించి కూడా వాయిదాలు పెట్టడమే తప్ప నేటి వరకు అమలు చేసింది లేదన్నారు.

## ఖలిస్థానీ వేర్పాటు వాది అమృత్‌పాల్‌కి మైక్ గుర్తు కేటాయింపు



ఛండీగఢ్ : జైలులో ఉన్న ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్‌సింగ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పంజాబ్ లోని ఖదూర్ సాహిబ్ పార్లమెంట్ స్థానం నుంచి అమృత్‌పాల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు కేంద్ర ఎన్నికల సంఘం మైక్ గుర్తును కేటాయించింది. వారిస్ పంజా దే సంస్థకు అమృత్‌పాల్ చీఫ్. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయి, ప్రస్తుతం అసోం లోని దిబ్రూగడ్ జైలులో ఉన్నారు. అదే విధంగా ఫరీద్‌కోట్ రిజర్వ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సరబ్‌జిత్ సింగ్ ఖాస్లాకు చెరుకురైతు గుర్తును ఈసీ కేటాయించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని హత్య చేసిన నిందితుల్లో ఒకరైన బియాంత్ సింగ్ కుమారుడే సరబ్‌జిత్ సింగ్. పంజాబ్‌లోని 13 స్థానాలకు చివరి ఏడోవిడతలో జూన్ 1న పోలింగ్ జరగనుంది.

## కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలు

కర్నాల్ : కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సోమవారం కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాకు వీలు కల్పించిన 370 అధికరణాన్ని బుజ్జగింపు రాజకీయాల కోసమే కాంగ్రెస్ రద్దు చేయలేదని ఆయన ఆరోపించారు. హర్యానాలోని కర్నాల్‌లో ఒక ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ప్రసంగిస్తూ, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె) భారత్‌కు చెందుతుందని, 'మేము దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటాం' అని పునరుద్ఘాటించారు. రామ మందిరం అంశంపై కూడా కాంగ్రెస్‌ను బిజెపి సీనియర్ నేత అమిత్ షా తూర్పారబట్టారు. పార్టీ మైనారిటీ వోటు బ్యాంక్‌ను సంతుష్టి పరచేందుకు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ వంటి ఆ పార్టీ అగ్ర నేతలు రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొనలేదని ఆయన ఆరోపించారు. కాశ్మీర్‌పై కాంగ్రెస్ తీరును అమిత్ షా ఆక్షేపిస్తూ, 'బుజ్జగింపు రాజకీయాల దృష్టానే వారు 370 అధికరణాన్ని రద్దు చేయలేదు' అని విమర్శించారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం పెచ్చుమీరుతున్నా ఆ అధికరణాన్ని కాంగ్రెస్ ఉపసంహరించలేదని హోమ్ శాఖ మంత్రి ఆరోపించారు. 'ప్రజలు అంతా నరేంద్ర మోడీజీని రెండవ పర్యాయం ప్రధానిని చేశారు. 2019 ఆగస్టు 5న ఆయన 370 అధికరణాన్ని రద్దు చేశారు. ఇప్పుడు కాశ్మీర్‌లో మన త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతుంది' అనిఆయన చెప్పారు. కర్నాల్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, కర్నాల్ లోక్‌సభ సీటుకు పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అమిత్ షా సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 'కాశ్మీర్ మనదేనా కాదాచెప్పండి. బాగా గట్టిగా చెప్పండి. మీ వాణి ఖర్గేను చేరాలి' అని అన్నారు. అమిత్ షా ఎఐసిసి అధ్యక్షునిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ, 'ఖర్గే సాహబ్ ! మీరు 80 ఏళ్లవారు. కానీ దేశాన్ని మీరు అర్థం చేసుకోలేదు. హర్యానా యువత తమ ప్రాణాన్ని కాశ్మీర్ కోసం ఇస్తారు' అని అన్నారు. రాజస్థాన్‌లో ర్యాలీలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై కాకుండా 370 అధికరణం రద్దు గురించి ప్రధాని ఎందుకు మాట్లాడారని ఎఐసిసి అధ్యక్షుడు ఇటీవల చేసిన వ్యాఖ్యను దృష్టిలో పెట్టుకుని అమిత్ షా ఆ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ వివాదానికి దారి తీసిన కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ అణు బాంబు వ్యాఖ్యను కూడా హోమ్ శాఖ మంత్రి ఆక్షేపించారు.




## అహ్మదాబాద్‌లో నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టు

గుజరాత్ పోలీసులు సోమవారం అహ్మదాబాద్ విమానాశ్రయంలో నలుగురు ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులను అరెస్టు చేశారు. ఆ నలుగురు ఉగ్రవాదులూ శ్రీలంక జాతీయులని, యూదులకు ముఖ్యమైన ప్రదేశాలు లక్షంగా దాడులు చేయాలని వారిని కోరారని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. ఐసిస్ ఉగ్రవాదులు మొదట కొలంబో నుంచి చెన్నై వచ్చినట్లు, తరువాత వారు అహ్మదాబాద్ చేరినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. అహ్మదాబాద్ విమానాశ్రయంలో తమ పాకిస్తానీ బాధ్యుల నుంచి ఒక సందేశం కోసం వారు నిరీక్షిస్తుండగా గుజరాత్ పోలీస్ ఉగ్రవాద నిరోధక బృందం (ఎటిఎస్) వారిని పట్టుకున్నదని ఆ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదుల దగ్గర నుంచి కొన్ని పాకిస్తానీ తయారీ ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్‌లో గుజరాత్ ఎటిఎస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) గుజరాత్ తీరంలో 14 మంది పాకిస్తానీ జాతీయులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 602 కోట్లు విలువ చేసే 86 కిలోల నిషిద్ధ మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. అంతకు ముందు ఎన్‌సిబి గుజరాత్, రాజస్థాన్‌లో 'మ్యావ్ మ్యావ్'గా పేర్కొనే నిషిద్ధ డ్రగ్ మెఫెడ్రోన్‌ను తయారుచేసే మూడు ల్యాబ్‌ల గుట్టు రట్టు చేసింది. ఎన్‌సిబి ఆ సందర్భంగా ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసింది.



## కేజ్రీ జ్యుడీషియల్ కస్టడీ కోరిన ఇడి

న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో జూన్ 2న ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ లొంగిపోయిన తరువాత ఆయన జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని ఇడి సోమవారం కోరింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోయినప్పుడు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ ఇడి, సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఒక అర్జీ దాఖలు చేసింది.



ఇంతకు ముందు మంజూరైన జ్యుడీషియల్ కస్టడీ గడువు సోమవారం ముగిసిందని ఇడి తెలిపింది. సుప్రీం కోర్టు ఉత్తర్వును పురస్కరించుకుని కేజ్రీవాల్ జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. జూన్ 2న లొంగిపోవాలని ఆయనను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇది ఇలా ఉండగా, కేజ్రీవాల్‌పై, సహ నిందితురాలు భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నాయకురాలు కె కవితపై కేసులో విచారణ జరపడానికి వారికి వ్యతిరేకంగా తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని ఇడి కోర్టులో తెలిపింది.

ఆ ఇద్దరు రాజకీయ నేతలపై దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్లకు మద్దతుగా ఇడి తన వాదనలు వినిపించింది. చార్జిషీట్లను పరిగణనలోకి తీసుకునే విషయంలో ఇడి వాదనలను న్యాయమూర్తి మంగళవారం విచారణ కొనసాగిస్తారు.

# సంపాదకీయం

## జీవజాతులు అంతరిస్తే జీవవైవిధ్యానికి విఘాతం..!

"సమస్త వణ్యప్రాణులు గ్రంధాలయంలో చదివిన, చదవని పుస్తకాల లాంటివి. వణ్యప్రాణులను గుర్తించక పూర్వమే వాటి వినాశనం జరిగితే పుస్తకాలను చదవకుండానే గ్రంధాలయం అగ్నికి ఆహుతి అయినట్లు భావించాలని" అని ప్రముఖ శాస్త్రజ్ఞుడు జాన్ దిన్‌జల్ అభిప్రాయపడ్డారు. వన్యప్రాణులను అంతరించకుండా కాపాడుకోవడం, వాటి జనాభా తగ్గకుండా చూడడం, జీవ వైవిధ్యాలను పరిరక్షించడం అనే లక్ష్యంతో "డిజిటల్ పరిజ్ఞానంతో వన్యప్రాణుల రక్షణ" అనబడే నినాద అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం మన కర్తవ్యం కావాలి. వన్యప్రాణి శరనార్థి జీవజాతులు, జంతు ప్రదర్శనశాలలు, మ్యూజియమ్స్, నందనవనాలు, పౌర సంఘాలు, యన్‌జిఓలు, విద్యావేత్తలు, నిపుణులు, జంతు ప్రేమికులు లాంటి వర్గాలు అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతుల పరిరక్షణ, పునరుద్ధరణ ప్రయత్నాలు, అవగాహన లాంటి వివిధ కార్యక్రమాలు రూపొందించడానికి ఈ వేదికలు వినియోగపడతాయి. భూమండలంపై జీవరాసుల ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక రకాలైన జీవజాతులు భౌతిక శారీరక పరివర్తనం, బయలాజికల్ స్థితులు, వాతావరణ మార్పులను బట్టి నెమ్మదిగా అంతరించడం ప్రకృతి నియమంగా జరుగుతూనే ఉన్నది. నేటి డిజిటల్ యుగపు మానవుడు చేస్తున్న వికృత పర్యావరణ వ్యతిరేక కార్యాలతో వేగంగా పలు జీవజాతుల అంతరిస్తున్నాయని, అంతరించే ప్రమాదపు లేదా విలుప్తత లేదా విపత్తు అంచున ఉన్నాయనే విషయం జంతు ప్రేమికులను కలవరపెడుతున్నది. మానవ ప్రమేయంతో అతివేగంగా అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతులను 'విపత్తు లేదా అంతరించే అంచున ఉన్న జీవజాతులు(ఎండేంజర్డ్ స్పీసీస్)' అంటాం. అడవు నరికివేత, కార్చిచ్చులు, వాతావరణ ప్రతికూల మార్పులు, వణ్యప్రాణి అక్రమ రవాణా లాంటి పలు కారణాలతో అంతరించే అంచున జీవజాతులు ఉండడం విచారకరం. అంతరించే దుస్థితిలో ఉన్న జీవజాతులను గుర్తించి వాటి పరిరక్షణకు కంకణబద్ధులం కావాలని, లేని యెడల జీవవైవిధ్యానికి విఘాతం కలిగి ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. అంతరించే జాతులను గుర్తించడానికి కొన్ని ప్రమాణాలను నిర్ణయించారు. ఒకేరకమైన జీవజాతి 10 ఏళ్లలో 50-70 శాతం జనాభా తగ్గడం, జీవజాతుల నివాసాల వైశాల్యం పూర్తిగా తగ్గడం, జీవజాతి జనాభా 2,500 వరకు తగ్గడం, జీవజాతి జనాభా 250 ఉన్నప్పుడు రానున్న రెండు దశాబ్దాల్లో అవి అంతరిస్తాయని గమనించాలి. సమస్త జీవజాతుల్లో 27 శాతం, అనగా 41,000 జాతులు అంతరిస్తున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. మానవ అనాలోచిత ప్రమేయం, సహజ నివాస స్థలం ప్రభావితం కావడం, కొత్త జీవజాతులను సహజ నివాసాల్లో వదలడం, అతి వేట, కాలుష్యం, జీవజాతులకు రోగాలు, అడవుల నరికివేత, ప్రపంచ జనాభా పెరగడం, అపరిమిత ప్రణాళికారహిత పట్టణీకరణ, అర్థరహిత అభివృద్ధి, వాతావరణ ప్రతికూల మార్పులు, జన్యుపరమైన మార్పులు వంటి కారణాలతో పలు జీవజాతులు వేగంగా అంతరిస్తున్నాయని గమనించారు. రానున్న రెండు దశాబ్దాల్లో కనీసం 500లకు పైగా జీవజాతులు అంతరిస్తాయని కూడా విశ్లేషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతుల్లో జవన్ రీనో, అమూర్ లిపర్డ్, సుంద ఐలాండ్ టైగర్, మౌంటేయిన్ గొరిల్లాస్, టపనులీ ఒరంగుటన్, పర్పోయిస్, బ్లాక్ రీనో, ఆఫ్రికన్ ఎలిఫంట్, సుమంత్రన్ ఒరంగుటన్, హాక్స్‌బిల్ టర్‌టిల్స్ లాంటివని జాబితాలో ముందు వరుసలో వస్తాయి. 2011లో భారతదేశంలో 47 జీవజాతులు తీవ్రంగా అంతరించే దుస్థితిలో ఉన్నాయని, 2018లో ఇండియా తయారు చేసిన ఐయుసియన్ రెడ్ లిస్ట్‌లో 132 వృక్షజీవజాతులు (క్రిమి కీటకాలు, పక్షులు, చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, క్షీరదాలు లాంటి వర్గ) అంతరించే ప్రమాదపు అంచున ఉన్నట్లు తెలిపారు. వీటిలో 73 జాతులు (9 క్షీరదాలు, 18 పక్షులు, 26 సరీసృపాలు, 20 ఉభయచరాలు) తీవ్రంగా అంతరించే ప్రమాదపు (క్రిటికల్లీ ఎండేంజర్డ్ స్పీసీస్) జీవజాతులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. అధిక జనసాంద్రత కలిగిన ఇండియాలో బెంగాల్ టైగర్, ఏసియాటిక్ లయన్, స్నో లిపర్డ్, వన్-హార్న్డ్ రీనో, బ్లాక్‌బక్, లయన్-టెయిల్డ్ మకాక్యూ, ట్రీ ఫ్రాగ్, కాశ్మీరి రెడ్ స్టాగ్, నిల్‌గిరి టెహర్, ఇండియన్ బైసన్(గౌర్) లాంటివి అంతరిస్తున్న జాబితాలో ఉన్నాయని తెలుస్తున్నది. పటిష్టమైన వన్యప్రాణి పరిరక్షణ చట్టాలు చేయడం, చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచడం, అడవుల పరిరక్షణ, జంతు వేటను కట్టడి చేయడం, అభయారణ్యాల ఏర్పాటు, అడవులకు కంచెలు వేయడం, జాతీయ వనాల ఏర్పాటు, రిజర్వ్ ఫారెస్టుల పరిరక్షణ, అంతరించే జాతులకు ప్రత్యేక ప్రాజెక్టులు (ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫంట్ లాంటివి) ఏర్పాటు చేయడం, అక్రమ రవాణాను కట్టడి చేయడం, సుస్థిరాభివృద్ధికి మార్గాలు వేయడం లాంటి చర్యలు అంతరించే ప్రమాదంలో ఉన్న జీవజాతులకు జీవం పోసినట్లు అవుతుందని తెలుసుకోవాలి. మనిషిలో మానవత్వం అంతరించే ప్రమాదపు అంచున ఉన్నప్పుడు సమస్త అవలక్షణాలకు, వినాశనాలకు దారులు పడతాయి.

# ఆరు నెలల్లో రేవంత్ జీరో చేసింది



**హైదరాబాద్:** ఆరు నెలల్లో తెలంగాణ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన రేవంత్ సర్కార్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ప్రభుత్వం ఆరో మాసం లోకి ప్రవేశించిందని.. ఎవరికైనా గ్రేడింగ్ ఇవ్వాలంటే మొదటి ఆర్ నెలలు ముఖ్యమైనవన్నారు. రేవంత్ రెడ్డి ఈ ఆరునెలల్లో తన ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం అని చెప్పుకోవడానికి ఏమీ లేదని విమర్శించారు. కేబినెట్ సమావేశం లో మంచి నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుంటున్నామన్నారు. రైతు బంధు దేశం లోనే మొదటి సారి అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. పీఎం సహా అనేక రాష్ట్రాల సీఎం లు రైతు బంధు ను ప్రశంసించారు ..ఇదే అనేక రైతు పెట్టుబడి సాయం పథకాలకు స్ఫూర్తి అని తెలిపారు. రైతుబంధు అనేది కాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ అని తెలిపారు. రోహిణీ కార్తె లో తొలకరి జల్లులు వస్తాయి .. రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కేసీఆర్ రైతు బంధు పథకం తెచ్చారన్నారు. దున్నేపుడే రైతుకు పెట్టుబడి సాయం వస్తే ఉపశమనం గా ఉంటుందని.. రేవంత్ యాసంగి రైతు బంధు పంటలు కోసే సమయానికి ఇచ్చారన్నారు. ఈ సారి అలాంటి తప్పు చేయకుండా రైతు భరోసా ను రోహిణి కార్తె లో విడుదల చేసేలా కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. జూన్ మొదటి వారం లోనే రైతులకు ఎకరాకు 7500 రూపాయలు విడుదల చేయాలి ..ఆ దిశగా కేబినెట్ లో నిర్ణయించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. వర్షా కాలం లోనే ఎక్కువగా సన్న రకాల ధాన్యం పండిస్తారని.. రబీ లో నూకల శాతం ఎక్కువగా ఉంటుందని రైతులు సన్న రకాలు సాగు చేయరనితెలిపారు. క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ సన్న వడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తిట్ల మీద కాకుండా రైతులకు మేలు చేయడం పై కేబినెట్ మీటింగ్ లో చర్చించాలన్నారు. బోనస్ ను బోగస్ గా మార్చకండిని.. రేవంత్ కు ఇదే కీలకమైన కేబినెట్ సమావేశం ..మంచి నిర్ణయాలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. న్నికలకు ముందు సన్నవడ్లకే బోనస్ అని సీఎం అంటే కాంగ్రెస్ కు డిపాజిట్లు కూడా వచ్చి ఉండేవి కావన్నారు. తడిసిన ధాన్యం రైతుల దగ్గర ఎంత ఉన్నా ఈ ప్రభుత్వం కొనుగోలు చేసి తీరాల్సిందేనని స్పష్టం చేశారు.

# కాకతీయ వర్సిటీలో 40 గంటల నిరసన




**వరంగల్:** తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు కలిగిన వరంగల్?లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో గందరగోళం నెలకొంది. నిత్య వివాదాలతో ఆ విశ్వవిద్యాలయం సతమతవుతుంది. తాజాగా ఇదే యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్స్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే 40 గంటలకుపైగా ఆందోళన నిర్వహించారు. ఆయన ఛాంబర్?లోనే భోజనం చేయడంతో పాటు ఏకంగా రాత్రంతా అక్కడే బసచేశారు. విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఓఎం నాయిని రాజేందర్ రెడ్డి హామీతో ఆందోళన విరమించారు.కే.యూ లో గత కొన్నేళ్లుగా టీచింగ్ ఫ్యాకల్టీ నియామకాలు నిలిచిపోయాయి. దీంతో కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ లెక్చరర్స్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్‌తో పాటు పార్ట్ టైమ్ లెక్చరర్స్ దాదాపు 126 మంది గత పదేళ్ళుగా పనిచేస్తున్నారు. పార్ట్ టైమ్ లెక్చరర్స్?కు మాత్రం ఆరు నెలలకు ఒకసారి జీతాలు వస్తుంటాయి. ఇదే విషయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా మంత్రులను కలిసి వారి గోడు వెళ్ల బోసుకున్నారు. తప్పకుండా పరిష్కరిస్తామని చాలా సార్లు హామీ ఇచ్చినప్పటికీ పరిష్కారం మాత్రం కాలేదు.పార్లమెంట్ ఎన్నికల హడావుడి ముగియడంతో పార్ట్ టైం లెక్చరర్స్ అంతా కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రమేశ్?ను కలిసి సమస్య పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన వీ.సీ మీరంతా అఫిడవిట్?లు తెచ్చుకోండి ఆర్డర్?లు ఇస్తామని హామి ఇచ్చారని బాధితులు తెలిపారు. ఆనందంతో ఉప్పొంగిపోయిన పార్ట్ టైం లెక్చరర్స్ అంతా అఫిడవిట్‌లు తెచ్చుకున్నారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. వైస్ ఛాన్స్‌లర్ మొఖం చాటేశాడు. దీంతో పార్ట్ టైం లెక్చరర్స్ అంతా రిజిస్ట్రార్?ను కలిసి మీరైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధం ఇదీ.. నేను చేయలేను అని చేతులెత్తేశారని పార్ట్ టైం లెక్చరర్స్ ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపు 40 గంటల పాటు రిజిస్ట్రార్ ఛాంబర్‌లోనే అందరూ బైఠాయించారు. ఏకంగా రాత్రి భోజనాలు కూడా అదే ఛాంబర్‌లో చేశారు. అనంతరం రాత్రి అక్కడే బస చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. బాధితుల ఆవేదన విన్న ఓఎం నాయిని రాజేందర్ రెడ్డి.. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్?పై ఆగ్రహం వ్యక్తం చేశారు.. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను మసక బారేటట్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. గంటల తరబడి లెక్చరర్స్ ఆందోళన నిర్వహిస్తుంటే పట్టించుకోకుండా ఏం చేస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని నిలదీశారు. వైస్ ఛాన్స్‌లర్ ఎందుకు ఇక్కడకు రాలేదని ప్రశ్నించారు. వీసీ రమేశ్ పదవీ విరమణకు ముందు పెద్ద సంఖ్యలో ఎందుకు ఆర్డర్స్ తీస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పార్ట్ టైమ్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కోరారు. ప్రభుత్వ పరంగా ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని చెప్పారు.

# హైదరాబాద్ లో మరో ప్రీ లాంచ్ మోసం



**హైదరాబాద్:** సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల. హైదరాబాద్ లాంటి మహా నగరంలో ఓ సొంతిల్లు కొనుక్కోవాలని ప్రతి ఒక్కరి ఆశ. అలాంటి వారి ఆశలనే ఆసరాగా చేసుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. తక్కువ ధరకే ప్లాట్స్ అంటూ ప్రకటనలతో మోసగిస్తున్నారు. తాజాగా, భాగ్య నగరంలో మరో భారీ ప్రీ లాంచ్ ఆఫర్ మోసం వెలుగుచూసింది. 'భారతీ లేక్ వ్యూ' పేరుతో భారీ మోసానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి భారతీ బిల్డర్స్ ఛైర్మన్ దూపాటి నాగరాజుతో పాటు ఎండీ శివరామకృష్ణ, సీఈవో నరసింహరావులను పోలీసులు అరెస్ట్ చేశారు. కొంపల్లిలోని భారతీ లేక్ వ్యూ ప్రీ లాంచ్ పేరుతో.. అతి తక్కువ ధరకే ప్లాట్స్ అంటూ దాదాపు 350 మంది నుంచి రూ. 80 కోట్ల వరకూ వసూలు చేసినట్లు గుర్తించారు. డబ్బులు వసూలు చేసి కూడా నిర్మాణాలు చేపట్టకపోవడంతో బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు.బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ' పేరుతో ఓ ప్రాజెక్టును చేపట్టి ప్రీ లాంచ్ ఆఫర్ పేరిట తక్కువ ధరకే ఫ్లాట్స్ అంటూ ప్రచారం చేశారు. తమ సంస్థ 6.23 ఎకరాల్లో నిర్మాణం చేపడుతుందని.. చదరపు అడుగు రూ. 3,200కే అంటూ నమ్మబలికారు. ఆకర్షణీయమైన ధరలకే ప్లాట్స్ ఇస్తామని రంగురంగుల బ్రోచర్లు పంపిణీ చేశారు. కొంపల్లిలోని వెంచర్ సైట్ తో పాటు మాదాపూర్ లోని కార్యాలయాల్లో కస్టమర్లతో సమావేశాలు నిర్వహించారు. వీరి మాటలు నమ్మిన దాదాపు 350 మంది డబ్బులు చెల్లించారు. దాదాపు రూ. 80 కోట్ల మేర వసూలు చేశారు. అయితే, తమకు ఫ్లాట్స్ నిర్మిస్తామని చెప్పిన 6.23 ఎకరాల స్థలాన్ని రూ. 100 కోట్లకు వేరే వారికి విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న కస్టమర్లు తాము మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంస్థకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంగన్వాడీ టీచర్ హత్యాచారం



వరంగల్: ములుగు జిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన అంగన్వాడీ టీచర్ మర్డర్ మిస్టరీ సంచలనం సృష్టించింది. విధులు ముగించుకొని ఇంటికి బయలుదేరిన ఆ మహిళ తాడ్వాయి శివారు అడవిలో దారుణంగా హత్యకు గురైంది. ఈ మర్డర్ మిస్టరీని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తాడ్వాయి పోలీసులు 48 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్?కు తరలించారు.ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన రడం సుజాత అనే మహిళ తాడ్వాయి మండలం కాటాపూర్?లో అంగన్ వాడీ టీచర్?గా విధులు నిర్వహిస్తుంది. విధులు ముగించుకొని ఇంటికి బయలుదేరిన సుజాత ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్న క్రమంలోనే సుజాత శవమై విగతజీవిగా కనిపించింది. తాడ్వాయి మండలం నాంపల్లి శివారు అడవిలోకి తీసుకెళ్ళి చున్నీతో గొంతు నులిమి హత మార్చారు. ఈ హత్యకు ముందు ఆమెపై అత్యాచారం జరిగిన ఆనవాళ్లు గుర్తించారు. అంగన్ వాడీ టీచర్ మర్డర్ మిస్టరీని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి కేవలం 48 గంటల వ్యవధిలోనే డిటెక్ట్ చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఒ టెక్నికల్ డేటా ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు వివరాలు మీడియా ముందు వెల్లడించారు.నిందితులు ఇద్దరూ ఏటూరునాగరం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన రామయ్య, జంపయ్యగా గుర్తించారు. కాటపూర్?లో విధులు ముగించుకొని బస్సు కోసం ఎదురు చూస్తున్న సుజాత బస్సు మిస్సవడంతో రామయ్య తన బైక్?పై తీసుకెళ్ళాడు. మార్గమధ్యలో తన స్నేహితుడు జంపయ్యతో కలిసి అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం ఆమె మెడలోని 3 తులాలబంగారు పుస్తెల తాడు, ఏటీ కార్డు అపహరించుకు పోయారు.

## బోరుబావికి మరమ్మత్తులు చేపించి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా

### - మున్సిపల్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపిన వార్డు ప్రజలు




**మంథని:** మంథని మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు మర్రివాడ లో గత కొద్దిరోజులుగా నిరుపయోగంగా ఉంటున్న బోరుబావి ని ఎవరు పట్టించుకోకపోవడంతో ఆ వార్డులో నీటి కొరతతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను వార్డు ప్రజలు స్థానిక కౌన్సిలర్ వికె రవి ద్వారా మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమాసురేష్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ బోరుబావి కి మరమ్మత్తులు చేపించి నూతన మోటార్ ను ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు.గత కొద్దిరోజులుగా తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించమని కోరిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ కు ఆ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వికె రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండా పాపారావు, నక్క శంకర్ తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బస్సు కిందపడి మహిళ మృతి




**ఖమ్మం:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సులో నుండి మహిళ జారిపడ్డారు.అయితే క్రింద పడిన మహిళపై నుంచి బస్సు వెనుక టైర్ ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొణిజర్ల మండలం పెద్దమనగాల గ్రామానికి చెందిన దూరి అనూష (26 )అనే మహిళ సామాన్య వ్యవసాయ కూలి గా ఉన్నారు.అనూష ఖమ్మంలో డి మార్ట్ లో పనిచేస్తుంది.ప్రతిరోజు లానే పెద్దమునగాల నుండి ఖమ్మం తాను పనిచేసే షాపుకు వెళ్లడానికి కొణిజర్లలో భద్రాచలం డిపోకు చెందిన టీఎస్ 28 జెడ్ 00 91 వన్ బస్సు ఎక్కారు.బస్సు బయలుదేరిన కొద్ది చేపట్టకే ఎంపీడీవో కార్యాలయం వద్ద బస్సులో నుంచి అనుష జారిపడి మృతి చెందింది. మృతి చెందిన మహిళకు మనస్విత, వినన్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.దీనితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## ప్రారంభమైన కన్నాల శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు



**మంథని:** మంథని మండలం కన్నాల గ్రామంలో కోలిచిన వారి కొంగు బంగారం చేసే శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి పంచాహ్నిక తిరుకళ్యాణ మహోత్సవ వేడుకలు శనివారం నుండి ఈ నెల 23 గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు మరియు గ్రామ పెద్దలు తెలిపారు. 18 శనివారం రోజున అభిషేకం కలశస్థాపన అఖండ దీపారాధన, అంకురారోపన, దేవత హవనం నిర్వహించారు. 19 ఆదివారం రోజున ఉదయం ధ్వజరోహనం సాయంత్రం 7-30 ని?లకు గోధులిక లగ్నం స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నారు. 20 సోమవారం రోజున నిత్యవిధి, సాయంత్రం గరుడసేవ. 21మంగళవారం రోజున సాయంత్రం పోన్నసేవ. 22 బుధవారం రోజున సాయంత్రం దోపోత్సవం. 23 గురువారం రోజున ఉదయం రథోత్సవం, నాగేవెల్లి నిర్వహించనున్నారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఇట్టి భగవత్ కార్యక్రమమునకు భక్తులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని తమవంతు సహాయ సహకారములు అందించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆ స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు కోరారు.

## కట్టంగూరు ఎర్రసానిగూడెంలో వ్యక్తిదారుణ హత్య

**నల్గొండ:** కృష్ణా జిల్లా ఇల్లా పామర్రుకు చెందిన ఆటో డ్రైవర్ కొల్లూరి రాజ వర్ధన్ నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెంలో దారుణ హత్య కు గురయ్యాడు. మృతదేహం ఎర్రసానిగూడెం హైవే పక్కన చెట్లలో పడి ఉంది. కాళ్లు కట్టి.. నోట్లో గుడ్డలు కుక్కి హత్య..చేతి పై బలమైన ఆయుధంతో పొడిచినట్లు గుర్తులు వున్నాయి. డబ్బులు కోసమే హత్య జరిగి ఉండవచ్చు అని చపోలీసులు అనుమానిస్తున్నారు. కట్టంగూరు పోలీసులు హత్య కేసు కింద కేసు నమోదు చేసారు.

## పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

### -అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్



**పెద్దపల్లి:** జిల్లాలో యాసంగి పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాబావ పరిస్థితులు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్ఫాలిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ వెంకటరాం రెడ్డిని అరెస్టు చేయాలి

### - బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్ రామిరెడ్డి ని అరెస్ట్ చేయాలనీ డీజీపీ కి ఫిర్యాదు చేసామని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శనివారం అయన డీజీపీని కలిసారు. తరువాత మీడియాతో మట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లో వెంకట్ రామిరెడ్డి పాత్ర ఉందని మాజీ డీసీపీ రాధాకిషన్ రావు స్టేట్ మెంట్ ఇచ్చాడు. అసెంబ్లీ ఎన్నికల సమయం లో వెంకట్ రామిరెడ్డికి సంబందించిన మూడు కోట్లు తరలించినట్లు రాధాకిషన్ స్టేట్ మెంట్ ఇచ్చారు. వెంకట్ రామిరెడ్డి పై ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు వెంకట్ రామిరెడ్డి ని కాపాడుతున్నారు.. ఎవ్వరు కాపాడుతున్నారు. సమాధానం చెప్పాలని డీజీపీ ని కోరాను. పొంగులేటి వియంకుడు వెంకట్ రామిరెడ్డి ని అరెస్ట్ చెయ్యడం లేదా...ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి .బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కి వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నా కూడా అరెస్ట్ చెయ్యడం లేదు.. వెంకట్ రామిరెడ్డి ని కులం ఒకటే అని ముఖ్యమంత్రి కాపాడుతున్నాడు. వెంటనే వెంకట్ రామిరెడ్డి ని అరెస్ట్ చేయాలి. మాజీ డీసీపీ రాధాకిషన్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా వెంకట్ రామిరెడ్డి ని అరెస్ట్ చేయాలని అయన అన్నారు.

## గంగాధర కొండాయ పల్లె గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన బీజేపీ నాయకులు



చొప్పదండి: కరీంనగర్ జిల్లా గంగాధర మండల శాఖ ఆధ్వర్యంలో గంగాధర,కొండాయ పల్లె గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను గంగాధర మండలం బీజేపీ నాయకులు శనివారం పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల, కొనుగోలు ఆలస్యం వల్ల, మార్కెట్లో ఎండబోసిన వడ్లు అకాల వర్షంతో తడిసి రైతులు నష్టపోతున్నారు. ఎటువంటి తరుగు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వడ్ల కొనుగోలు పూర్తి చేయాలని, రైతులకు ఇస్తానన్న బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు. ఐకేపీ �ః సొసైటీ సెంటర్లో పోసిన వడ్లు నెల అయిన కొనట్లేదు అంటే ప్రభుత్వం పని తీరు ఎలా వుందో అర్దం చేసుకోవచ్చని తెలిపారు. క్వింటల్ కీ బొనస్ ఇస్తా అని ఎకరాకు కీ 15 వేల రైతు బందు ఇస్తా అనీ 2 లక్షల ఋణ మాఫీ అనీ డబ్బాలు కొట్టి లాస్ట్ కి వడ్లు కూడా కొన చేత కాని ప్రభుత్వమని తెలిపారు. 6 నెలలు కష్టపడి పండించిన పంట చివరికి వర్షానికి మొలకచ్చాయని వాళ్ళ కన్నీటికీ కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో× గంగాధర మండల బిజెపి శాఖ అధ్యక్షులు కోల అశోక్,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్,ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, బిజెపి సీనియర్ నాయకులు ఎట్టెపు కనకయ్య, ఉపాధ్యక్షులు బొమ్మ కంటి రాజు రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్,మండల దళిత మూర్చ అధ్యక్షులు తాళ్ల రాజశేఖర్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# నిబద్ధతకు ప్రతిరూపం పుచ్చలపల్లి......



ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, సమసమాజం కోసం పోరాడిన విప్లవకారుడు. కులవ్యవస్థను నిరసించి పేరులో కులాన్ని సూచించే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ఉద్యమాల కోసం తన వాటా కింద వచ్చిన యావదాస్తిని ప్రజా పోరాటాల కోసం ఖర్చు చేసిన మార్గదర్శి. ప్రజలకు, పార్టీకి పూర్తి కాలం ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలనే ఉద్దేశంతో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న గొప్ప త్యాగశీలి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు. ఇలా పేర్కొంటూ వెళితే, పేజీలు చాలవు. ఆయనే కామ్రేడ్ "పి.ఎస్". గా పిలువబడిన, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పక్కా కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున జన్మించి, కమ్యునిజాన్ని ఔపోసన పట్టి, కన్ను మూసే వరకు ఆ భావజాలంలోనే కొనసాగిన పోరాట యోధుడు. పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో 1913, మే 1 న జన్మించారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లిదండ్రులు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించగా, ప్రాథమిక విద్యను వీధిబడిలోనే, తరువాత తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివారు.

గాంధీజీ నాయకత్వం పట్ల ఆకర్షితులై, సుందరయ్య 1930లో తన 17వ యేట ఉన్నత పాఠశాల రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలలోను, ఉప్పు సత్యాగ్రహం లోను, సహాయ నిరాకరణోద్యమం లోను పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. అతనిని నిజామాబాద్, బోర్స్టల్ స్కూలులో ఉంచారు. ఆ సమయంలో ఆయనకు కమ్యూనిస్టులతో పరిచయం ఏర్పడింది. విడుదల అయినాక తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడానికి కృషి చేశాడు. అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో సుందరయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికి ఆ పార్టీ నిషేధంలో ఉంది. 1930 దశకంలో దినకర్ మెహతా, సజ్జద్ జహీర్, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, సోలీ బాట్లీవాలా వంటి జాతీయ కార్య నిర్వాహక వర్గ సభ్యులైన ప్రముఖ కమ్యూనిస్టు నేతలతో చేరి సుందరయ్య క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి అయ్యారు. అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తరువాత దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను పార్టీ కేంద్ర కమిటీ సుందరయ్యకు అప్పగించింది. ఈ సమయంలోనే కేరళకు చెందిన నంబూద్రిపాద్, కృష్ణ పిళ్ళై వంటి నాయకులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుండి కమ్యూనిస్టు పార్టీలోకి మారారు. సుందరయ్య ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు శాఖను ప్రారంభించారు. ఇతర రాష్ట్రాలలో కమ్యూనిస్టు శాఖల ప్రారంభానికి కూడా స్ఫూర్తినిచ్చారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ప్రారంభించిన వారిలో సుందరయ్య ఒకరు. ఆ సభకు సంయుక్త కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించి నపుడు, 1939 నుండి 1942 వరకు, నాలుగేళ్ళు అజ్ఞాతంలో గడిపారు. 1943లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేశారు. బొంబాయిలో మొదటి పార్టీ కాంగ్రెస్ జరిగింది. తరువాత రెండవ పార్టీ కాంగ్రెస్ కలకత్తాలో జరిగింది. రెండుసార్లు కేంద్ర కమిటీ సభ్యునిగా సుందరయ్య ఎన్నికయ్యారు. కలకత్తా సమావేశంలో పార్టీ సాయుధ పోరాటంను సమర్థిస్తూ తీర్మానం చేసింది. దీనిని "కలకత్తా థీసిస్" అంటారు. అప్పటి సాధారణ కారదర్శి బి.టి.రణదివే ఈ తీర్మానాన్ని బలంగా సమర్ధించారు. తత్ఫలితంగా కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయుధాలను సమకూర్చుకోవడం ప్రారంభించారు. త్రిపుర, తెలంగాణ, తిరువాన్కురు ప్రాంతాలలో సాయుధ పోరాటాలు జరిగాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనది నిజాం పాలన కాలంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాట ఘట్టం. ఆ పోరాటానికి ముఖ్యమైన నాయకులలో సుందరయ్య ఒకరు. పోరాట చివరి దశలో 1948 నుండి 1952 వరకు సుందరయ్య అజ్ఞాతంలో గడిపారు. 1952 లో ప్రత్యేక పార్టీ సమావేశంలో మళ్ళీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్టీ అత్యున్నత స్థాయి సంఘమైన "పొలిట్ బ్యూరో" సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెసులోను, పాలక్కాడ్‌లో జరిగిన నాలుగవ పార్టీ కాంగ్రెసులోను కూడా కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. తరువాత అమృత్‌సర్‌లో జరిగిన ఐదవ పార్టీ కాంగ్రెస్‌లో సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కమిటీకి సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సమయంలోనే పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. 1962 లో చైనాతో భారతదేశం యుద్ధం సందర్భంగా, పార్టీ నాయకత్వంలో ఎస్.ఎ. డాంగే వర్గం భారత ప్రభుత్వాన్ని సమర్ధించింది. అంతే కాకుండా చైనా, రష్యా విభేదాలు తలెత్తిన నేపథ్యంలో డాంగే వర్గం రష్యాకు అనుకూలమైన పంథాను సమర్థించింది. అయితే పి.సి.జోషి, రణదివే వంటి నాయకుల వర్గం ఈ విధానాన్ని రివిజనిస్టు మార్గంగా భావించింది. డాంగే వర్గాన్ని లెఫ్టిస్టులనీ, రణదివె వర్గాన్ని రైటిస్టులనీ పిలిచారు. లెఫ్టిస్టు వర్గంలో ఉన్న ప్రముఖ నాయకుడైన సుందరయ్య అమృత్‌సర్ సమావేశం సమయంలో పార్టీ నాయకత్వంలో అధికుల (డాంగే వర్గం) ధృక్పథాన్ని వ్యతిరేకిస్తూ, తన బాధ్యతలన్నింటికీ రాజీనామా చేశారు. 1962 నవంబరులో, చైనా యుద్ధం సమయంలో సుందరయ్యను అరెస్టు చేశారు. "తెలంగాణా ప్రజల పోరాటం – దాని పాఠాలు" అన్న నివేదికలో సుందరయ్య అప్పటి పరిస్థితులనూ, పార్టీ విధానాలనూ, పోరాట క్రమాన్నీ విశదంగా విశ్లేషించాడు. సుందరయ్య తయారు చేసిన ఈ నివేదికను భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 1972 డిసెంబరు నెలలో విడుదల చేసింది. అక్టోబరు – నవంబరు 1964 లో జరిగిన 7వ పార్టీ కాంగ్రెస్‌లో భారతీయ కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. అందులో లెఫ్టిస్టులన బడేవారు భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పేరుతో క్రొత్త పార్టీగా ఏర్పడ్డారు. ఆ పార్టీకి సుందరయ్య సాధారణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది కాలంలోనే భారత జాతీయ కాంగ్రెసు ప్రభుత్వం అనేక మంది సి.పి.ఐ-ఎమ్ నాయకులను అరెస్టు చేసిన సమయంలో సుందరయ్య మే 1966 వరకు నిర్బంధంలో ఉన్నారు. 1975 – 1977 కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించి నపుడు అరెస్టును తప్పించు కోవడం కోసం సుందరయ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. 1976 వరకు సుందరయ్య సి.పి.ఐ-ఎమ్ పార్టీ సాధారణ కార్యదర్శిగా కొనసాగారు. 1976 లో, ఎమర్జెన్సీ కొనసాగుతున్న సమయంలో, పార్టీలో "రివిజనిస్టు" భావాలను వ్యతిరేకిస్తూ సుందరయ్య సాధారణ కార్యదర్శి పదవికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1952 లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యారు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభా సభ్యునిగా కొనసాగారు. కొంత కాలం విరామానతరం 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు కొనసాగారు. లీలా అనే సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగిని 1943 ఫిబ్రవరి 27న పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషీ, మరికొద్ది మంది పార్టీ నేతల సమక్షంలో వివాహం చేసుకుని, 1944 చివర్లో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కోవడం ఆయన కుల పక్షపాత రాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడై, కుల వ్యవస్థను నిరసించిన పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి...కులాన్ని సూచించే రెడ్డి తోక పదాన్ని పూర్తిగా తొలగించుకున్న ఆదర్శ మూర్తి. పార్లమెంటు భవననానికి రాష్ట్ర విధానసభకు వెళ్ళినపుడు సైకిలును ఉపయోగించడాన్నిబట్టి ఆయన నిరాడంబరత తేటతెల్లం అవుతుంది. పేదరికం, దోపిడీ నుంచి పేదల విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య 1985, మే 19న పుచ్చలపల్లి కన్నుమూశారు.

## 'టెక్'కు ఊతం భారతీయులే....!



ఏటేటా అమెరికాకు భారతీయ విద్యార్థులు పోటెత్తుతున్నారు. విశ్వంలో ఏ దేశానికి లేని క్రేజ్ అమెరికా కే దక్కింది. ఎందుకంటే అక్కడ చదివి ఉద్యోగం పొందితే డాలర్ల పంటే. అయితే ప్రస్తుతం ఆ ఉద్యోగాలు కొంచెం కష్టంగానే ఉన్నాయి. అయినా సరే విద్యార్థులు వేచి చూస్తున్నారు. అమెరికా వాళ్ళు కూడా భారతీయులను, వారి పనితీరు విధానం, నడవడి చూసి ముగ్దలవుతున్నారు. అదే భారతీయులను కట్టిపడేస్తుంది. అమెరికాలో అధికులు తెలుగు వాళ్ళే! అంతేందుకు ప్రపంచంలో పేరెన్నిక గల దిగ్గజ కంపెనీలలో భారతీయులదే హవా. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలకు భారతీయులే నాయకత్వం వహించడం గొప్ప విషయం. అమెరికా కంపెనీలలో కూడా చాలా వరకు మన భారతీయులే పనిచేస్తుండటం గర్వకారణం. ఈ విషయాన్ని సిలికాన్ వ్యాలీ సెంట్రల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ భాటియా చెప్పడం గమనార్హం.

ప్రపంచంలో ఏ దేశంలో కూడా భారతీయుల వంటి నిపుణులు లేరు. ఇక్కడకు వచ్చిన భారతీయులకు తొలుత కొంచెం కష్టంగా ఉన్నప్పటికీ అంచెలంచెలుగా ఎదుగుతారు. కష్టపడే తత్వం వాళ్ళు తెలుసుకుంటున్నారు. ఎన్నో భారతీయ కుటుంబాలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. గ్రీన్ కార్డు రావడం ఆలస్యం అయినా కొందరూ ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు. కొంతమంది కొంతకాలం ఉండి తిరిగి భారత్ వస్తున్నారు. అయితే తిరిగి వెళ్ళే వాళ్ళు బహు స్వల్పం. అమెరికాలో ఉన్న వాళ్లకు ఉద్యోగం ఉంటే, వారి కుటుంబాలకు స్వర్గ దామమే.. తల్లిదండ్రులకు ఎంతో కొంత డబ్బు పంపుతున్న వాళ్ళు ఉన్నారు. అమెరికాలో ఉన్న భారతీయులు పంపిన డబ్బుతోనే చాలామంది భారత్‌లో పెద్ద, పెద్ద అపార్ట్మెంట్స్‌లో నివసించడానికి ఫ్లాట్స్ కొంటున్నారు. నెల, నెల డబ్బు రావాలి.. తల్లిదండ్రులకు ఏ కష్టం ఉండకూడదు అనుకునే పిల్లలు ఉన్నారు. ఇంతవరకు మా కోసం కష్టపడ్డారు.

## మహాత్ముని హత్యకాండకు పూర్వాపరాలు...



నాథూరామ్ గాడ్సే (మే 19, 1910 – నవంబరు 15, 1949) గాంధీని హత్య చేసిన వారిలో ప్రధాన పాత్రధారుడు. గాంధీని హత్య చేసిన వ్యక్తిగా గాడ్సే ప్రపంచ వ్యాప్తంగా చిర పరిచితుడు. ఆయన మహారాష్ట్రలోని పూనే జిల్లా బారామతి పట్టణంలో జన్మించాడు. ఆయన తల్లి పేరు లక్ష్మి, తండ్రి పేరు వినాయక్ వామన్ రావు గాడ్సే. మొదట్లో గాంధీని అభిమానించే వాడు. తరువాత గాంధేయవాదం నుండి విడిపోయి ఆర్.ఎస్.ఎస్.లో చేరాడు. 1948లో పూనా నుండి ప్రచురించ బడిన హిందు మహాసభ వారి హిందూ రాష్ట్ర అనే వారపత్రికకు సంపాద కుడుగా పనిచేసాడు. గాడ్సే గాంధీని హతమార్చడం వెనక భారత్ – పాకిస్తాన్ విభజన ప్రధానాంశ నేపథ్యం ఉంది. సంబంధిత పూర్వాపరాలను చూస్తే... స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ – ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమితమయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాన మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ – ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది.

దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యామైన రీతిలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి పాలక వ్యవస్థ పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసల వల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ – పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిని 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాల మధ్య విరోధాలు ప్రబలి మత విద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం. జనవరి 12, 1948 రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు.

1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు.

# ఓట్ల వివరాల వెల్లడిలో జాప్యంపై ఇసి వివరణ కోరిన సుప్రీం



**న్యూఢిల్లీ :** పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ కేంద్రాలవారీగా ఎన్ని ఓట్లు పోలైనదీ సంఖ్యా వివరాలు తెలపాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌పై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ పిటీషన్‌పై స్పందించాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లోనే పోలింగ్ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రచురించేలా చూడాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సంస్థ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారిం చింది. దీనిపై వారం రోజుల్లోగా స్పందనను తెలియజేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

ఈ నెల 24న దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. ఎడిఆర్ తరుపున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోల్ అయిన ఓట్ల సంఖ్యను విడివిడిగా ఫారం-17 సి పార్ట్ 1 స్కాన్డ్ ప్రతుల రూపంలో పొందుపరిచేలా చేయాలని, ఈమేరకు ఇసి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఎడిఆర్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న ముగిసినా, పోలైన ఓట్ల సంఖ్యను 11 రోజుల తరవాత ఏప్రిల్ 30న ప్రచురించారు. ఏప్రిల్ 26న జరిగిన రెండో దశ పోలింగ్ శాతాన్ని నాలుగు రోజుల తరవాత అందుబాటులో ఉంచారు.

పోలింగ్ రోజున ఎన్నికల సంఘం వెల్లడించిన ఓటింగ్ శాతం కన్నా అయిదారు శాతం ఎక్కువగా ఏప్రిల్ 30న గణాంకాలు కనిపించాయి. దీనిపై అనుమానాలు తలెత్తుతున్నాయని ఎడిఆర్ తమ పిటిషన్‌లో పేర్కొంది. పోలింగ్ శాతం ప్రకటించడంలో జాప్యాన్ని కాంగ్రెస్, సిపిఎం వంటి పార్టీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు ఇప్పటికే ఈ విషయంపై లేఖలు కూడా రాసాయి.


## మే 21న పాలస్తీనాను దేశంగా గుర్తించే తేదీని ప్రకటిస్తాం



పాలస్తీనాకు ప్రత్యేక దేశ హోదా కల్పించేందుకు ప్రపంచ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇలాంటి టైంలో స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించే తేదీని మే 21న ప్రకటిస్తానని స్థానిక మీడియాకు తెలిపారు స్పెయిన్ ప్రధాని. ఈయూ ప్రకటించినట్లుగానే మే 21న పాలస్తీనాపై నిర్ణయం తీసుకుంటున్నారా అనే ప్రశ్నపై స్పెయిన్ ప్రధాని స్పందించారు. ఈయూ సహా ఇతర దేశాలతో సమన్వయం అవుతున్నామని వెల్లడించారు. స్లోవేనియా, మాల్టా, ఐర్లాండ్ లతో పాటు స్పెయిన్ కూడా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించేందుకు మార్చిలోనే ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. శాశ్వతంగా శాంతి పొందేందుకు ఇజ్రాయెల్- పాలస్తీనాల సమస్యకు పరిష్కారం అవసరమని అన్నారు.

స్పెయిన్, ఐర్లాండ్, స్లోవేనియా మే 21న పాలస్తీనా దేశాన్ని ప్రతీకాత్మకంగా గుర్తించాలని యోచిస్తున్నాయని ఈయూ విదేశాంగ పాలసీ చీఫ్ జోసెప్ బోరెల్ అన్నారు. గతవారం స్పానిష్ పబ్లిక్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తెలిపారు. మరోవైపు, ఐర్లాండ్ విదేశాంగమంత్రి మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించడం ఖాయమని.. అయితే ఇంకా తేదీని ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇక ఐక్యరాజ్యసమితిలోని 193 సభ్యదేశాల్లో 137 దేశాలు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. పాలస్తీనాకు ఈయూ దేశాల మద్దతు లభించినప్పటికీ.. ఫ్రాన్స్, జర్మనీ నుంచి మద్దతు దొరకట్లేదు. ఇజ్రాయెల్ తో శాంతి చర్చలు జరిపాకే ఇలాంటి ప్రత్యేక దేశ గుర్తింపు ఇవ్వాలని పాశ్చాత్య దేశాలు వాదిస్తున్నాయి.

## భారత్ కంటే శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం మరొకటి లేదు:




భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపై అమెరికా ప్రశంసల వర్షం కురిపించింది. ప్రపంచంలో భారత్ కంటే శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం మరొకటి లేదని తెలిపింది. ఈ మేరకు వైట్‌హౌస్ జాతీయ భద్రతా సమాచార సలహాదారు జాన్ కిర్బీ ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ భారత్‌ను కొనియాడారు. భారతీయులు ఓటు వేయడంతోపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పడం ప్రశంసనీయమని తెలిపారు. 'భారతదేశంలో 96 కోట్ల మంది ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో భాగమవుతున్నారు. 2,660 గుర్తింపు పొందిన పార్టీల నుంచి అభ్యర్థులను ఎన్నుకుంటున్నారు. వేలాది మంది పోటీదారుల నుంచి 545 మంది పార్లమెంటు సభ్యులను ఎన్నుకోబోతున్నారు' అని తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌లో జరుగుతున్న ఎన్నికలను అమెరికా నిశితంగా గమనిస్తోందన్నారు. బైడెన్ పరిపాలనలో గత మూడేళ్లలో ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో భారత్-అమెరికా సంబంధాలు బలోపేతం అయ్యాయన్నారు. భారత్‌తో మా సంబంధం చాలా సన్నిహితంగా ఉందని, మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రధాని మోడీతో స్నేహాన్ని మరింతగా పెంచుకోవాలని బైడెన్ భావిస్తున్నట్టు స్పష్టం చేశారు. క్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయని వెల్లడించారు. ఇండో-పసిఫిక్ క్వాడ్‌ను విస్తరించి రెండు దేశాల సైన్యాలు కూడా అనేక యుద్ధ విన్యాసాలలో పాల్గొన్నాయని గుర్తు చేశారు.

## టూరిస్ట్ బస్సులో చెలరేగిన మంటలు...




హర్యానా : హర్యానాలో శుక్రవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. నిన్న అర్ధరాత్రి ఒంటిగంట 30 నిముషాల సమయంలో కదులుతున్న టూరిస్ట్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఎనిమిదిమంది సజీవదహనమయ్యారు. మరికొందరు తీవ్రగాయాలపాలయ్యారు.బస్సులో ప్రయాణిస్తున్న బాధితులు సరోజ్ పుంజ్, పూనమ్ మాట్లాడుతూ %౮% శుక్రవారం తాము టూరిస్ట్ బస్సును అద్దెకు తీసుకొని బనారస్, మధుర బృందావన్ దర్శనానికి బయలుదేరామని చెప్పారు. బస్సులో మహిళలు, పిల్లలు సహా 60 మంది ఉన్నారు. పంజాబ్‌లోని లూథియానా, హోషియార్‌పూర్, చండీగఢ్‌లలో నివాసముంటున్న వారంతా దగ్గరి బంధువులు అని తెలిపారు. స్థానికుల సహాయంతో కొందరిని ఎలాగోలా రక్షించామని అన్నారు. ఈ ఘోర దుర్ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సజీవ దహనం కాగా, రెండు డజన్ల మందికి పైగా తీవ్రంగా కాలిపోయారు. క్షతగాత్రులను వివిధ ఆసుపత్రుల్లో చేర్పించారు. సాయం కోసం సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు సాబీర్, నసీమ్, సాజిద్, ఎహసాన్ తదితరులు మాట్లాడుతూ.. రాత్రి 1:30 గంటల సమయంలో కదులుతున్న బస్సులో మంటలు ఎగిసిపడుతున్నాయని చెప్పారు. బస్సు ఆపాలంటూ.. డ్రైవర్‌ను కేకలు వేసినా బస్సు ఆగలేదు. ఆ తర్వాత మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడు బస్సును వెంబడించి మంటలు చెలరేగడంతో డ్రైవర్‌కు సమాచారం అందించాడు. ఆ తర్వాత బస్సు ఆగింది కానీ అప్పటికి బస్సులో మంటలు చెలరేగాయి.

## బంధం మరింత బలోపేతం


బీజింగ్: చైనా, రష్యా మధ్య సహకార బంధాన్ని మరింత బలోపేతం గావించాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించి పలు ఒప్పందాలపై చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ గురువారం సంతకాలు చేశారు. ఆ తరువాత వారు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టపరచుకోవడం ద్వారా కొత్త శకాన్ని నెలకొల్పేందుకు ఇరువురు నేతలు ప్రతినబూనారు. ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలనే విషయంలో రష్యా,చైనా నిబద్ధతను ఈ సంయుక్త ప్రకటన చాటిచెబుతోంది. ఉక్రెయిన్ సమస్యకు సరైన రాజకీయ పరిష్కారం చూపాలనే దానిపై ఇరు దేశాలు ఏకీభావంతో ఉన్నాయి. పుతిన్ రెండు రోజుల చైనా పర్యటన శక్రవారంతో ముగిసింది.

ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ రష్యా, చైనా మధ్య సంబంధాలు స్థిరమైనవి, రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలే కాకుండా ప్రాంతీయ, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సులకు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. చైనా, రష్యా రెండూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు, అభివృద్ధి చెందున్న ప్రధాన మార్కెట్‌లని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, రష్యా మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు. రెండు దేశాలు ఈ సందర్భఆన్ని కొత్త శకం ప్రారంభానికి బిందువుగా



తీసుకోవాలని, ద్వైపాక్షిక సహకారాన్ని సుసంపన్నం చేసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పుతిన్ మాట్లాడుతూ, చైనాతో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం, ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (షాంఘై సహకార కూటమి) వంటి ఫ్రేమ్‌వర్కులలో సన్నిహితంగా కమ్యూనికేట్ చేసుకోవడం, సహకరించుకోవడం, మరింత న్యాయమైన, సమతుల్యతతో కూడిన అంతర్జాతీయ క్రమాన్ని ఏర్పాటు చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని అన్నారు. వాణిజ్యం, ఆర్థికం, ప్రకృతి పరిరక్షణ, తనిఖీ, మీడియా వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు సంబంధించిన ఒప్పందాలపై ఇరువురు నేతలు సంతకాలు చేశారు.

## ఒలింపిక్స్ టైంలో ఉక్రెయిన్‌లో సీజ్‌ఫైర్.. ఫ్రాన్స్ ప్రతిపాదనకు పుతిన్ నో



ఒలింపిక్స్ టైంలో ఉక్రెయిన్ లో కాల్పుల విరమణ చేయాలన్న ప్రతిపాదనను తిరస్కరించారు రష్యా అధ్యక్షుడు పుతిన్. అంతేకాకుండా, ఒలింపిక్స్ లో రష్యా అథ్లెట్ల పట్ల అన్యాయంగా ప్రవర్తించాయని చెప్పుకొచ్చారు. పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ సందర్భంగా "ఒలింపిక్ సంధి" కోసం ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుయేల్ మాక్రాన్ పిలుపునిచ్చారు. అయితే, ఫ్రాన్స్ అధ్యక్షుడి ఆలోచనకు మద్దతు ఇస్తున్నారా అని పుతిన్ ని అడగగా.. కాల్పుల విరమణ చేపట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. చైనా పర్యటన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతర్జాతీయ క్రీడా అధికారులు ఒలింపిక్ చార్టర్ సూత్రాలను పాటించట్లేదని ఆరోపించారు. తమ బ్యానర్, జెండా, జాతీయగీతంతో తమ అథ్లెట్లు ప్రదర్శనలు ఇచ్చేందుకు క్రీడా సంస్థలు అనుమతించడంలేదని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి ఒప్పందానికి ఎవరూ రాలేదని తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా కాల్పుల విరమణ చేపట్టేందుకు ఒలింపిక్ సంధి గురించి తన ఆలోచనను ప్రకటించారు ఫ్రాన్స్ అధ్యక్షుడు.

## మోడీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల ప్రచార సభల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యానిస్తున్నారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలు అధికారంలోకి వస్తే.. అయోధ్యలో రామమందిరాన్ని బుల్డోజర్‌లతో కూల్చివేస్తారని ఆయన వ్యాఖ్యానించారు. మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. ఇప్పటివరకు తాము బుల్డోజర్లు వాడలేదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ఇసి (ఎన్నికల సంఘం) చర్యలు తీసుకోవాలని ఖర్గే అన్నారు. ప్రధానమంత్రే ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం ప్రకారం రక్షిస్తామని, రాజ్యాంగాన్ని ఫాలో అవుతామని ఆయన అన్నారు. ఇండియా బ్లాక్‌కు మమతా మద్దతు గురించి కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ విమర్శించారు. బెంగాల్ సిఎం మమతా 'ఇండియా' బ్లాక్ కంటే కూడా.. ఎన్‌డిఎకి మద్దతు ఇస్తున్నారు అని అధిర్ అన్నారు. ఈయన వ్యాఖ్యలపై ఖర్గే స్పష్టం చేశారు. మమతా మొదట ఇండియా' బ్లాక్‌కి బయటి నుంచి సపోర్టు ఇస్తామని, ఒకవేళ ప్రభుత్వం ఏర్పడితే.. అప్పుడు ప్రభుత్వంలో కలుస్తామని ఆమె ఇటీవల కూడా పేర్కొన్నారు.

## కేసులేమో వందల్లో.. శిక్షలేమో రెండు శాతం..!

కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడం పట్ల కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా 'ఇదేదో సాధారణ తీర్పు అని నేను అనుకోవడం లేదని, దేశంలో చాలామందికి కోర్టు కేజ్రీవాల్‌కి స్పెషల్ ట్రీట్మెంట్ ఇచ్చినట్లు నమ్ముతున్నారని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు.అయితే, ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కార నేరం కిందకి రాదా? అంటూ ప్రశ్నిస్తున్నారు మేధావులు. అసలు ఆయన ఉద్దేశ్యం ఏమిటి? బీజేపీ ప్రభుత్వం ప్రాథమిక ఆధారాలు ఉన్నా, లేకున్నా.. విపక్ష నేతలపై ఎలాంటి కేసులైనా పెడతాం. బెయిల్ రాకుండా ఎలాంటి సెక్షన్లనైనా ఇరికిస్తాం.. కానీ, కోర్టులు నిందితులకు బెయిల్ ఇవ్వకూడదని ఆయన ఉద్ధేశ్యమా? దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు ఎవరికి బెయిల్ ఇవ్వాలో.. ఎందుకివ్వాలో కూడా దేశ హోంమంత్రే నిర్ణయిస్తారా? న్యాయమూర్తులకు బెయిల్ ఎందుకివ్వాలో కూడా తెలియదా? ఇది బాహాటంగా సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడం కాదా? రాజ్యాంగ బద్ద పదవిలో ఉన్న హోంమంత్రికి ఇలాంటి విపరీత వ్యాఖ్యానాలు చేయడం తగునా? సామాన్య ప్రజలకు కోర్టుల తీర్పుపై అనుమానాలను రేకెత్తించడం సమంజసమా? చట్టరీత్యా నేరం కాదా? విజ్ఞులు ఆలోచించాలి. అమిత్ షా వ్యాఖ్యలు పరోక్షంగా అత్యున్నత న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావటమే అవుతుంది.

మొన్న ఎలక్టోరల్ బాండ్ల కేసులోనూ సుప్రీంకోర్టు తీర్పుపై దాదాపు ఇలాంటి వ్యాఖ్యానాలే వినిపించాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బాండ్స్ ఎవరు కొన్నారో, ఎవరు వాటిని క్యాష్ చేసుకున్నారో, ఎంత మొత్తంలో ఏ పార్టీకి లబ్ధి చేకూరిందో మెదలైన స్పష్టమైన సంపూర్ణ సమాచారం కోర్టుకు, ఎన్నికల సంఘానికి ఇవ్వకుండా పరోక్షంగా ఎవరు అడ్డుకున్నారో ప్రజలు గ్రహించారు. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆజ్ఞలు జారీ చేయటంతో కొన్ని నిజాలైనా వెలుగు చూశాయి. ప్రొఫెసర్ సాయిబాబా పై కేంద్ర ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టింది. తల్లి అవసాన దశలో ఉంటే కూడా కోర్టులో బెయిల్ రాకుండా అడ్డుకుంది. కనీసం కన్న తల్లి మరణిస్తే అంతిమ సంస్కారాలు జరపకుండా, కడసారి చూపులు దక్కకుండా ఆయనకు బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంది. సుమారు 90 శాతం వికలాంగునికి సరైన వైద్య సహాయం కూడా అందించకుండా జైల్‌లో నిర్బంధించింది.

పది సంవత్సరాల తరువాత, అనేక శారీరక, మానసిక వేదనలు అనుభవించిన తరువాత, కోర్టు ఆయనను నిర్దోషిగా విడుదల చేసింది. ఆయన తల్లి, భార్య ఆర్థికంగా, మానసికంగా ఎంతో క్షోభను అనుభవించారు. అక్రమ అరెస్ట్ వల్ల ఆయన ఉద్యోగం పోయింది. కుటుంబం ఆయన జీతంపైనే ఆధారపడి ఉండటంతో.. వేరే ఆదాయం లేకపోవటంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఆరోగ్యం బాగా క్షీణించింది. చివరకు నిర్దోషిగా విడుదలైనా ఆయన పోగొట్టుకున్న స్వేచ్ఛాయుత జీవితానికి లెక్క కట్టేదెవరు? నేరస్తుడిగా సమాజంలో ముద్రపడితే ఆయన, ఆయన కుటుంబం ఎదుర్కొన్న పరువు నష్టానికి బాధ్యులు ఎవరు? ఎలాంటి ఆధారాలు లేని తప్పుడు కేసులను పెట్టి 10 సంవత్సరాలు వేధించటం, తర్వాత మాకు ఏ సంబంధం లేదన్నట్లు చేతులు దులుపుకుంటే సరిపోతుందా? ఇలాంటి తప్పుడు కేసులలో ఇరికించిన ప్రభుత్వానికి కోర్టులు ఏ శిక్షలు విధించవా? ఇది బాధితుడికి న్యాయం చేయడమే అవుతుందా?

మొన్న ప్రబీర్ పుర్కాయస్థని సైతం విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పైగా ఆయనను కేంద్ర ప్రభుత్వం 'ఉపా' కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆయన ఈ కేసులో ఆరు నెలలకు పైగా జైలులో ఉన్నారు. అయితే, ప్రబీర్‌ని ఇలా అక్రమంగా నిర్బంధించడం ఇదే మొదటిసారి కాదు. 48 ఏళ్ల క్రితం ఇదే ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసినప్పుడు ఆయనకు పాతికేళ్లు. అప్పుడు కూడా ఆయన ఎలాంటి నేరం చేయలేదు. పోలీసుల దగ్గర ఎలాంటి ఆధారాలూ లేకుండానే తప్పుడు కేసులు పెట్టారు. అప్పుడు దేశంలో ఎమర్జెన్సీ ఉంది కనుక విచారణ కూడా లేకుండానే ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. ఇప్పుడు కూడా ప్రాథమిక ఆధారాలు లేకుండానే 74 ఏళ్ల వయసులో గత అక్టోబర్‌లో ప్రబీర్‌ను మళ్లీ పోలీసు కస్టడీలోకి తీసుకున్నారు. ఇప్పుడు దేశంలో ఎలాంటి ప్రకటిత ఎమర్జెన్సీ లేదు. ప్రబీర్ అప్పుడు విద్యార్థి, ఇప్పుడు ఆయన జర్నలిస్ట్. దేశంలో అవినీతిపరుల గుట్టును రట్టు చేసే వామపక్ష మేధావి. 'న్యూస్ క్లిక్' సంపాదకుడు. ఈ రోజు వరకు ఏ ప్రభుత్వానికి తలొగ్గకుండా నిష్పక్షపాతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న ప్రజాస్వామిక వాది. అప్పటి ప్రకటిత ఎమర్జెన్సీకీ ఇప్పటి అప్రకటిత ఎమర్జెన్సీకి ఏమీ తేడా లేదు. విధానాలలో ఎలాంటి మార్పు రాలేదు.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులను, పౌరహక్కుల నేతలను ప్రజల కష్టాలను ఎలుగెత్తి చాటినందుకు.. ప్రభుత్వ లోపాలను ఒక జర్నలిస్టుగా, బాధ్యత గల పౌరుడిగా పత్రికలలో ప్రశ్నిస్తూ సంపాదక వ్యాసాలు ప్రచురిస్తే అర్బన్ నక్సలైట్, దేశ ద్రోహిగా, రాజ ద్రోహిగా ముద్ర వేసి కవులను, కళాకారులను, జర్నలిస్టులను, సంపాదకులను, ప్రొఫెసర్లను, చైతన్యం గల పౌరులను అక్రమంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తుంది.

రాజకీయ నాయకుల మెప్పుకోసం, ప్రమోషన్ల కోసం చట్ట విరుద్ధమైనప్పటికీ చట్ట వ్యతిరేక ఆదేశాలను పాటిస్తూ కొందరు ప్రభుత్వ అధికారులు, పోలీసులు, దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి. విపక్ష నేతలపై అక్రమంగా ఈడీ, సీబీఐ, ఇన్‌కం టాక్స్ సంస్థలు గత పదేళ్ళలో.. అవినీతి కేసులు కొన్ని వందలు పెట్టాయి. వాటిల్లో కేవలం 2.5 శాతమే శిక్షలు పడ్డాయి. కొందరు విపక్ష రాజకీయ నేతలు కేసుల నుండి తప్పించుకోవటానికి బీజేపీలో చేరారు. దాంతో కొందరిపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. వారు వాషింగ్ మిషన్‌లో కడగబడి పునీతులు అయ్యారు. మరికొందరిపై జరుగుతున్న విచారణ వేధింపులు లేకుండా మధ్యలో ఆగిపోయాయి.

# రెగ్యులర్ డేట్ కంటే ముందే పీరియడ్స్ రావాలా...?



ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన జీవనశైలి ఉంటే.. మనిషికి అనారోగ్యాలు దరిచేరవు. ఒత్తిడి, ఆందోళనతో పాటు మారిన ఆహారపు అలవాట్లు కూడా స్త్రీలలో రుతుక్రమం ఆలస్యంగా రావడానికి ప్రధాన కారణాలు. ఒత్తిడి పెరిగితే శరీరంలో కార్టిసోల్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది.

ఇది రుతుక్రమ చక్రం మార్పుకు కారణమవుతుంది. హార్మోన్ అసమతుల్యత వల్ల పీరియడ్స్ ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. మితిమీరిన వ్యాయామాలు కూడా ఒక రీజన్ కావొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాదు.. థైరాయిడ్, అధిక బరువు ఉన్నవారిలోనూ హార్మోన్ల ఇన్ బ్యాలెన్స్ కామన్ గా ఉంటుంది. %ూజూూ% సమస్య ఉన్నవారు కూడా సమయానికి పీరియడ్స్ రాక ఇబ్బంది పడుతుంటారు. మీరు అనుకున్న డేట్ కంటే పీరియడ్స్ ముందుగా రావడానికి మందులు మింగే కంటే.. ఇంట్లోనే కొన్ని ఆహారాలను తినడం మేలు. అవేంటో చూద్దాం. అందరి వంటింట్లో ఉండే ఆహార పదార్థం వాము. దీనిని బెల్లంతో కలిపి తింటే.. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పి తీవ్రత తగ్గుతుంది. రోజూ ఉదయాన్నే.. ఒక గ్లాసు నీటిలో టీ స్పూన్ వాము, టీ స్పూన్ బెల్లం తురుమును వేసి మరిగించాలి. కాస్త గోరువెచ్చగా చల్లారిన తర్వాత తాగాలి. ఇలా క్రమం తప్పకుండా తాగితే పీరియడ్స్ రెగ్యులర్ అయ్యే ఛాన్స్ ఉంది. వంటింట్లోనే ఉండే మరో దినుసు.. ధనియాలు. ధనియాలు కూడా పీరియడ్స్ త్వరగా రావడానికి సహాయపడుతాయి. 2 కప్పుల నీటిలో ఒక టీ స్పూన్ ధనియాలను వేసి.. చిన్న మంటపై మరిగించాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టి గోరువెచ్చగా చల్లారాక తాగాలి. దీనిని రోజుకు 3 సార్లు తాగితే రుతుక్రమం త్వరగా వస్తుంది. దానిమ్మను ఎక్కువగా తిన్నా, దానిమ్మ జ్యూస్ తాగినా రెగ్యులర్ గా పీరియడ్స్ వచ్చే అవకాశాలున్నాయి. 10-15 రోజులపాటు ఇలా చేస్తే.. నెలసరి త్వరగా వస్తుంది.

## ఇంట్లో మొక్కలు వల్ల అలర్జీ వస్తాయా..?



ఈరోజుల్లో చాలా మంది తమ ఇళ్లు అందంగా కనపడటం కోసం మంచి వర్క్‌తో పాటు చెట్ల మొక్కలను, పూల మొక్కలనుపెంచుకుంటారు. మొక్కలను చూసినప్పుడు మనం రిలీఫ్ కూడా అవుతుంటాం.అయితే ఇంట్లో మనం పెంచే మొక్కలకు సంబంధించిన ఓ అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. ఇంట్లో పెంచుకునే మొక్కలే మన ఆరోగ్యానికి అనేక రకాల సమస్యలు తెచ్చిపెడతాయని అధ్యయనంలో పేర్కొన్నారు. ఇంట్లో ఉండే కొన్ని మొక్కలు ఆక్సిజన్ స్థాయిని పెంచుతాయి.

అయితే అవి డెంగ్యూ జ్వరం నుండి అలెర్జీలు, ఉబ్బసం వరకు ప్రతిదానికీ ప్రమాదాన్ని కలిగిస్తాయి. డెంగ్యూ జ్వరం వంటి అంటు వ్యాధుల వ్యాప్తికి అలంకార మొక్కలు కూడా కారణమని ఆరోగ్య శాఖ పేర్కొంది. ఇండోర్ పరిస్థితుల వల్ల వేసవిలో కూడా వెస్ట్ నైలు, డెంగ్యూ జ్వరం వంటి అంటు వ్యాధులు ప్రబలుతాయని ఆరోగ్య శాఖ చెబుతోంది. ఇండోర్ ప్లాంట్స్‌లో దోమలు వృద్ధి చెందుతాయి. నీరు, తేమ, ధూళి స్తబ్దత అనేక ఇతర వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది.

మట్టికి నీరు పెట్టడమే కాకుండా బాటిళ్లలో మొక్కలను పెంచుతున్నప్పుడు వాటిని మార్చుతూ నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కోవిడ్ తర్వాత మాత్రమే ప్రజలు ఇంటి లోపల మొక్కలు పెంచడానికి ఆసక్తి చూపడం ప్రారంభించారు. కానీ ఆకులపై ఉన్న దుమ్ము పొర గాలితో ఇంట్లోకి ఎగిరిపోతుంది. ఇది అలెర్జీ, ఆస్తమా ప్రమాదానికి కూడా కారణమవుతుంది.

# ఉప్పు ఎక్కువగా తీసుకుంటే మరణమే......?



ఉప్పు షడ్రుచులలో ఒకటి. మనుషులు ఎలాంటి ఆహారం తీసుకున్నా..

అందులో లవణం లేకపోతే రుచి ఉండదు. ఉప్పు రుచిని మాత్రమే కాకుండా శరీరాన్ని అదుపులో ఉంచడానికి ఉపయోగపడుతుంది. కండరాల సంకోచం, నరాల పనితీరులో ఉపయోగపడుతుంది. ఆహారంలో ఉప్పు అవసరమైనంత వాడితేనే ఆరోగ్యంగా ఉంటారు.


లేకుంటే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఉప్పును తక్కువగా తీసుకుంటే నీరసంగా ఉంటుంది. అయితే ఎక్కువగా తీసుకున్నా గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. ఆహార పదార్థాల్లో రుచికోసం ఉప్పు వాడకం బాగా పెరిగిపోయింది. దీంతో ప్రతీ ఏడాది 18.9 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని World Health Organisatio (WHO) తెలిపింది. అయితే ఎంత మోతాదులో ఉప్పు తీసుకోవాలి? ఆహారంలో ఉప్పు ఎక్కువగా తినేవారికి గుండె జబ్బులు త్వరగా వస్తాయి. అధిక రక్త పోటు నుంచి మూత్రపిండాల వ్యాధి, ఎముకల నష్టం, అధిక దాహం వంటి సమస్యలు వస్తాయి. ఉప్పులో సోడియం అధికంగా ఉంటుంది. దీంతో బీపీ ఎక్కువై గుండెపోటుకు గురయ్యే అవకాశం ఉంది.

ఒక్కోసారి గుండు ప్రమాదం తీవ్రమై చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో మూత్ర పిండాలపై కూడా ప్రభావం ఉంటుంది.అయితే ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల ప్రతీ సంవత్సరం 18.9 లక్షల మంది మరణిస్తున్నట్లు డబ్ల్యూ హెచ్ వో తెలిపింది. ప్రస్తుతం టేస్ట్ కోసం ఎక్కువగా ఉప్పును వినియోగిస్తున్నారట. అంతేకాకుండా ఫ్రైడ్ ఫుడ్, జంక్ ఫుడ్ లల్లో ఉప్పు మలినంగా మారి శరీరానికి హాని కలిగిస్తుందని తెలిపారు. ప్రాసెస్ చేసిన ఆహారంలో ఎక్కువగా ఉప్పు వినియోగవ్వై శరీరానికి హానిని కలిగిస్తుందన్నారు. అంతేకాకుండా కూరల్లో ఉప్పు తక్కువైనప్పుడు పచ్చి ఉప్పువేయడం ప్రమాదమేనని హెచ్చరిస్తున్నారు.

# ఉదయాన్నే ఈ నీటిని తాగండి


తులసి ఆకులకు చాలా ప్రత్యేకత ఉంటుంది. వీటివల్ల ఆరోగ్యం బాగుంటుంది అంటారు ఆయుర్వేద నిపుణులు. తులసిలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. అందుకే ఆరోగ్యానికి మేలు చేస్తుంది తులసి. ఈ ఆకులను రాత్రి మొత్తం నానబెట్టి ఉదయమే ఖాళీ కడుపుతో తీసుకోవాలి. తులసిలో అడాప్టోజెనిక్ గుణాలు ఉన్నాయి. అంటే శరీరం ఒత్తిడిని ఎదుర్కోవటానికి తులసి నీరు సహాయపడుతుంది. తులసీ నీటి ఉపయోగాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది.

వేసవిలో తులసి నీరు తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటున్నాయి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగాలి అంటున్నారు నిపుణులు. ఇలా తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. అంతేకాదు శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో మేలు చేస్తుంది తులసి నీరు. దాని యాంటీ



ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది.

## మష్రూమ్ కాఫీతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు...!



టీ ప్రియుల మాదిరిగానే భారతదేశంలో కాఫీ ప్రియులకు కొదవలేదు. ఆఫీసులో పని చేస్తున్నప్పుడు బద్ధకాన్ని తరిమికొట్టాలనుకుంటున్నా లేదా తాజాగా రోజును ప్రారంభించాలన్నా ముందుగా ఒక కప్పు కాఫీ తాగడానికి ఇష్టపడతారు. కాఫీ అనేక కలయికలతో ఉన్నప్పటికీ, వాటిలో అమెరికన్ కాఫీ, ఎస్ప్రెస్సో, డబుల్ షాట్ ఎస్ప్రెస్సో, లాట్టే, మాక్ కాటో, ఫ్రాప్పే, మోచా బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం మనం మష్రూమ్ కాఫీ గురించి మాట్లాడబోతున్నాం. అవును మీరు ఎప్పుడైనా మష్రూమ్ కాఫీ తాగారా ? ఇది రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. మరి ఆ కాఫీ ఎలా తయారు చేసుకోవాలి, ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. మష్రూమ్ కాఫీ 1930, 1940 లలో కాఫీ ప్రియులకు అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ కాఫీని ఔషధంగా ఉపయోగించారు. ఇది శక్తిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు తెలిపారు.

లయన్స్ మేన్, రిషి, చాగా, కార్డిసెప్స్ వంటి పుట్టగొడుగులను సాధారణంగా మష్రూమ్ కాఫీ కోసం ఉపయోగిస్తారు. వాటిని ఎండబెట్టి పొడి రూపంలో తయారు చేస్తారు. మష్రూమ్ కాఫీ చేయడానికి, వేడినీరు, ఇన్‌స్టంట్ కాఫీ, మష్రూమ్ పౌడర్ తీసుకోవడమే కాకుండా, మీరు రుచికి అనుగుణంగా పాలు, స్వీటెనర్ కూడా తీసుకోవచ్చు. ముందుగా మీ అవసరానికి అనుగుణంగా కాఫీని తయారు చేసి, ఆపై వంట చేసేటప్పుడు దానికి పుట్టగొడుగుల పొడిని జోడించండి. బాగా కలిపిన తర్వాత మీరు స్వీటెనర్‌ను జోడించవచ్చు. ఈ విధంగా మీ మష్రూమ్ కాఫీ సిద్ధంగా ఉంటుంది. ఇది చిన్న పరిమాణంలో ప్రారంభించవచ్చు. మష్రూమ్ కాఫీలో మంచి మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.

ఇవి మీ మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రభావవంతంగా ఉంటాయి. పుట్టగొడుగులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

ఇది మంచి పేగు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అయితే ఇది పుట్టగొడుగుల నాణ్యత, దానిని తయారుచేసే ప్రక్రియ పై ఆధారపడి ఉంటుంది.

## బీర్ వల్ల ప్రమాదకరమైన వ్యాధులు




మీరు ప్రతిరోజూ బీర్ తాగితే జాగ్రత్తగా ఉండండి, ఎందుకంటే అది మీ ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. ఈరోజుల్లో బీర్ ట్రెండ్ పెరిగిపోవడంతో దాని వల్ల ఎలాంటి హాని జరుగుతుందో తెలియక ప్రజలు దాని వైపు ఆకర్షితులవుతున్నారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.బీర్ మిమ్మల్ని కొంత సమయం పాటు ఒత్తిడి లేకుండా చేస్తుంది.

కానీ దీర్ఘకాలంలో అది మీకు శారీరక, మానసిక వ్యాధులను కూడా ఇస్తుంది. మీరు కూడా బీర్‌కు బానిస అయితే దాని వల్ల కలిగే 5 తీవ్రమైన నష్టాలు ఇక్కడ తెలుసుకోండి. బీర్ లో చాలా కేలరీలు ఉంటాయి. దీన్ని రోజూ తీసుకుంటే చాలా కేలరీలు శరీరంలోకి చేరుతాయి. ఇందులో కార్బోహైడ్రేట్ అధిక పరిమాణంలో ఉంటుంది. ఇది బరువును పెంచుతుంది. ఇది కాకుండా, దీన్ని తాగడం వల్ల ఆకలి కూడా పెరుగుతుంది. బీర్ కాలేయానికి కూడా హాని కలిగిస్తుంది.

ఎక్కువ కాలం ఆల్కహాల్, బీర్ తాగడం వల్ల లివర్ వాపు, ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. దీనివల్ల కాలేయం కూడా దెబ్బతింటుంది. ఆల్కహాల్ బీర్ కూడా కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని పెంచుతుందని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అనేక అధ్యయనాల్లో చూపింది.

దీని వల్ల నోరు, కాలేయం, రొమ్ము మరియు గొంతు క్యాన్సర్ వస్తుంది. సెప్టెంబరు 2021లో న్యూట్రియెంట్స్ జర్నల్‌లో ప్రచురించబడిన మరొక అధ్యయనంలో ఆల్కహాల్ తాగడం వల్ల జీర్ణవ్యవస్థ క్యాన్సర్‌ను కూడా పెంచుతుందని చెప్పబడింది.

# గుండెల్లో మంట దేనికి సంకేతం...?



కొన్ని ఆరోగ్య సమస్యలు పెద్ద హానికరమైనవి కాకపోవచ్చు. కానీ వాటి లక్షణాలు మాత్రం ఏదో జరుగుతుందనే అనుమానాలు రేకెత్తిస్తాయి. ప్రాణహాని సంభవిస్తుందేమోననే భయాన్ని కలిగిస్తాయి.అలాంటి వాటిలో గుండెలో లేదా ఛాతీలో మంట ఒకటి. కానీ ఇది ఎసిడిటీవల్ల వచ్చే సాధారణ సమస్యగా నిపుణులు పేర్కొంటున్నారు.

కొన్ని చిట్కాలతో తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. అదెలాగో చూద్దాం. రాత్రిపూట పడుకున్నప్పుడు లేదా పొద్దున్న లేవగానే గుండెల్లో మంటగా అనిపించడం గుండె జబ్బు లక్షణం ఏమాత్రం కాదు. ఇది శరీరంలోని యాసిడ్ రిఫ్లెక్స్ వల్ల తలెత్తే సాధారణ సమస్య. జంక్ అండ్ స్పైసీ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, ఆహారం పరిమితికి మించి తినడం, రాత్రిపూట ఆలస్యంగా తినడం, ఉదయం లేట్‌గా నిద్రలేవడం వంటి అలవాట్లతో ఈ సమస్య వస్తుంది. కాబట్టి జీవన శైలిలో, ఆహారపు అలవాట్లలో సరైన మార్పులు చేసుకోవడమే దీనికి చక్కటి పరిష్కారంగా వైద్య నిపుణులు చెప్తున్నారు. అయితే సమస్య తలెత్తినప్పుడు ఇంటిలో పాటించగలిగే కొన్ని రెమెడీస్ కూడా గుండెల్లో మంటను, ఎసిడిటీ సమస్యను తగ్గిస్తాయి. ఎసిడిటీవల్ల వచ్చే గుండెల్లో మంటను తగ్గించడంలో సోంపు వాటర్ అద్భుతంగా పనిచేస్తుంది. అంతేకాకుండా ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



# కంగనా రనౌత్ ఏం చెప్పారో తెలుసా..?

బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటి కంగనా రనౌత్ తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధి.. 'ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే మీరు సినిమాలకు దూరంగా ఉంటారా..?' అని ప్రశ్నించారు. అందుకు అవుననే సమాధానం ఇచ్చారు. ఎంపీగా గెలిస్తే సినిమాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. 'బాలీవుడ్‌లో నేను విజయం సాధించా. నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకున్నా. మండి ఎంపీగా గెలుపొందితే బాలీవుడ్‌కు వీడ్కోలు పలకాలనుకుంటున్నా. ఒక ఉత్తమ ఎంపీగా ప్రజలకు నావంతు సేవ చేసేందుకు కృషిచేస్తా. అదే నాకు గొప్ప అవార్డుగా భావిస్తా' అని కంగనా చెప్పారు. అయితే ఎంపీగా గెలిచినా సినీ ఇండస్ట్రీలో కొనసాగాలని నిర్మాతల నుంచి తనకు విజ్ఞప్తులు వస్తున్నాయని ఆమె తెలిపారు.

'మీరొక ప్రతిభావంతమైన నటి. సినిమాలకు దూరంగా ఉండొద్దు' అని చాలా మంది నిర్మాతలు, ప్రముఖ నటులు కోరుతున్నట్లు కంగనా రనౌత్ చెప్పారు. అంతకుముందు మరో వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా భిన్నంగా స్పందించారు. ఏమన్నారంటే.. 'ఎన్నికల ముందు నేను సంతకం చేసిన కొన్ని సినిమాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంతో వెంటనే బాలీవుడ్‌ను విడిచి పెట్టలేను' అని చెప్పారు. కంగనా రనౌత్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీపడ్డారు. ఎన్నికల కారణంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' వాయిదా పడింది. ఎన్నికల వేళ కంగనా బిజీగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం ఇటీవల ప్రకటించింది. ఈ సినిమా కంగనా స్వీయ దర్శకత్వంలో రూపొందుతోంది.



# ఛాన్స్ కొట్టేసింది.. ఆ పాత్ర రష్మిక మాత్రమే..

భాషలకు అతీతంగా ఇటు దక్షిణాదిలో అటు బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ.. దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకుంటూ.. సూపర్‌స్టార్‌గా అవతరించింది రష్మిక. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్నవన్నీ క్రేజీ ప్రాజెక్టులే. అల్లు అర్జున్ 'పుష్ప2', ధనుష్ 'కుబేర'లతోపాటు బాలీవుడ్‌లో రెండు క్రేజీ సినిమాలకు కమిట్ అయ్యింది రష్మిక. ఎంత బిజీగా ఉన్నా మంచి అవకాశం వస్తే మాత్రం డేట్స్ అడ్జస్ట్ చేసుకొనైనా ఆ సినిమా చేసేయడం రష్మిక స్టైల్. అందుకే ఆమె దగ్గరకి వచ్చిన మంచి పాత్రలు వెనక్కి వెళ్లవ్. రీసెంట్‌గా అలాంటి మరో మంచి అవకాశమే నేషనల్ క్రష్‌ని పలకరించింది. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా శిబిచక్రవర్తి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో ఛాన్స్ కొట్టేసింది రష్మిక. ఇది రష్మిక మాత్రమే చేయగలిగిన పాత్ర అని, అందుకే ఆమెను కలిశామని దర్శకుడు శిబిచక్రవర్తి చెబుతున్నారు. హిట్ సినిమాల్లో నటించడం, గొప్ప పాత్రలతో మెప్పించడం అందరికీ సాధ్యంకాదు. అందుకే రష్మిక లక్కీ.

# అగ్గంటుకుంది సంద్రం.. ఆ గుండె మండే ఆకసం..



ఎన్టీఆర్ 'దేవర' సినిమాలోని ఫస్ట్ సాంగ్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఇందులోని ఎన్టీయార్ కేరక్టరైజేషనే ఈ పాట. తారక్ మాస్ ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకొని అద్భుతంగా ఈ పాటను మలిచారు దర్శకుడు కొరటాల శివ. మాస్ ప్రేక్షకులకు విందుభోజనం లాంటి సినిమాగా 'దేవర' తెరకెక్కుతున్నదని ఈ పాట చూస్తే అర్థమవుతుంది. 'అగ్గంటుకుంది సంద్రం.. ఆ గుండె మండే ఆకసం.. అరాచకాలు భగ్నం.. చల్లారే చెడు సాహసం..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, అనిరుథ్ రవిచంద్రన్ స్వరపరిచి, ఆలపించారు. ఇందులోని హీరో గుణగణాలను, వీరత్వాన్ని తన సాహిత్యంతో అద్భుతంగా ఆవిష్కరించారు గీత రచయిత రామజోగయ్యశాస్త్రి. ఇక అనిరుథ్ సంగీతం మాస్‌ని ఉర్రూతలూగించేలా ఉంది. వెన్నెల్లో అందంగా కనిపించే సముద్రాన్ని రక్తసిక్తంగా చూపిస్తూ, తెగిపడిన శరీర భాగాలతో, దారుణమైన మారణాయుధాలతో ఆద్యంతం పోరాటాలతోనే ఈ పాట సాగింది. ఎన్టీయార్ మాస్ అవతార్ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంది. రెండు పార్టులుగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని కలిసి నిర్మిస్తున్నారు. అక్టోబర్ 10న సినిమా విడుదల కానుంది.



# గెటప్ శ్రీను ప్రతిభకు హద్దులు లేవు

'ఈ తరం కామెడీ నటుల్లో నాకు ఇష్టమైన నటుడు గెటప్ శ్రీను. ఇప్పుడే తను హీరోగా నటించిన 'రాజు యాదవ్' ట్రైలర్ చూశాను. కొత్తదనం కనిపించింది. ఇందులో శ్రీను నవ్విస్తాడు, కవ్విస్తాడు, చక్కని వినోదాన్ని పంచుతాడు.' అని పద్మవిభూషణ్ చిరంజీవి అన్నారు. గెటప్ శ్రీను హీరోగా నటించిన 'రాజు యాదవ్' సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా గెటప్ శ్రీను ఆదివారం చిరంజీవిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. చిరంజీవి ఇంకా మాట్లాడుతూ 'గెటప్ శీనుని చూస్తుంటే నాకు అప్పటి కామెడీ హీరో చలం గుర్తొస్తారు. గెటప్‌శ్రీను ప్రతిభకు హద్దులు లేవు అనిపిస్తుంది. కచ్చితంగా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని శుభాకాంక్షలందించారు. కృష్ణమాచారి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మించిన విషయం విదితమే.

# రుతుపవనాల కదలికతో స్టాక్ ర్యాలీలో భారీ మార్పు..




భారత్ వ్యవసాయంపై ఆధారపడిన దేశం. దేశంలో సాగును అనుసరించి ప్రతీ ఒక్క ముందుకు కదులుతుంది. రుతుపవనాల్లో మంచి కదలికలు ఉండి..
సకాలంలో సరిపోయేన్ని వర్షాలు పడితే చాలు మంచి దిగుబడి వస్తుంది.ఇక పంట సమయంలో పరికరాల తయారీ నుంచి ఉత్పత్తి వినియోగదారుడి కడుపులోకి వెళ్లే వారకు ప్రతీ రంగం పచ్చగా ఆనందంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ సారి 2024లో రుతుపవనాల్లో మంచి కదలికలు ఉంటాయని వార్త రావడంతో స్టాక్ లు భారీగా ర్యాలీ తీశాయి. సమృద్ధిగా వర్షాలు పంట దిగుబడికి దారితీస్తాయని.. గ్రామీణ డిమాండ్ పెంచుతాయని వ్యాపారులు పందెం వేస్తున్నందున.. దేశంలోని లోతట్టు ప్రాంతాల నుంచి తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని ఆర్జించే భారతీయ సంస్థల స్టాక్‌లు పునరుద్ధరణ సంకేతాలను చూపుతున్నాయి. 2024లో సాధారణం కంటే ఎక్కువ రుతుపవన వర్షాల అంచనాలను అనుసరించి వ్యవసాయ-పరికరాల తయారీదారులు ర్యాలీ చేశారు.నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ మేలో ఇప్పటి వరకు 1.5 శాతం పెరిగింది, బెంచ్‌మార్క్ ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్‌ను రెండు శాతం కంటే ఎక్కువ పాయింట్లతో ఓడించింది. ఇది గత ఆరు నెలల్లో ప్రతిదానిలో తక్కువ పనితీరు కనబరిచింది. 'మంచి రుతుపవనాల నుంచి గ్రామీణ డిమాండ్‌లో మార్కెట్ తిరిగి పుంజుకోవచ్చని అంచనా వేస్తోంది.' అని ముంబైలోని %ఇన్వ్రా% మ్యూచువల్ ఫండ్‌లో వ్యూహకర్త సాహిల్ కపూర్ అన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని అంచనా వేస్తే.. అది వ్యవసాయోత్పత్తి, గ్రామీణ ఆదాయానికి ఉపకరిస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ స్టాక్‌లలో రికవరీ అనేది దేశపు విస్తృత స్టాక్ మార్కెట్‌కు శుభవార్త. విస్తారమైన వర్షాలతో ఉత్పత్తి పెరిగి ఆహార ధరల్లో మార్పుల వల్ల ద్రవ్యోల్బణం తగ్గి దేశ ఆర్థిక వృద్ధి, కార్పొరేట్ ఆదాయాల అవకాశాలను మెరుగుపరుస్తాయి.

# ప్రతి భారత విద్యార్థి చదవాల్సిన పుస్తకం ఇది..




పాల్ జీ హెవిట్ రాసిన 'కాన్సెప్చువల్ ఫిజిక్స్' అనే పుస్తకాన్ని భారత్‌లోని ప్రతి విద్యార్థి చదవాలని ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ ఎన్ఆర్ నారాయణమూర్తి తెలిపారు.రచయిత ఈ పుస్తకాన్ని అద్భుతంగా రాశారని, భారతీయ భాషల్లోకి అనువదించాల్సిన అవసరం ఉందని ఓ టీవీ చానెల్ కిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.'ప్రస్తుతం నేను కాన్సెప్చువల్ ఫిజిక్స్ అనే పుస్తకం చదువుతున్నా, హైస్కూల్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని హైస్కూల్ టీచర్ పాల్ జీ హెవిట్ ఈ పుస్తకం రాశారు. ఫిజిక్స్ ఎలా బోధించాలో అద్భుతంగా విశ్లేషించారు. రచయిత అనుమతి లభిస్తే, దీన్ని అన్ని భారతీయ భాషల్లోకి అనువదించాలి. ఇందులో అద్భుతమైన ఎక్సర్‌సైజ్‌లు ఉన్నాయి. క్లిష్టమైన ఐడియాలను చాలా చక్కగా వివరించారు.
ప్రతి భారతీయ విద్యార్థి దీన్ని చదవడం వల్ల సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో మంచి అవగాహన ఏర్పడుతుంది' అని అన్నారు. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయన్న భయాలను ఆయన కొట్టి పారేశారు. దీని ప్రభావం మరింత ఎక్కువ చేసి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. కొత్త అవకాశాల సృష్టి, మనుషుల ఉత్పాదకత పెంచే సామర్థ్యం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు ఉందన్నారు. 1970ల్లోనూ ఇదే తరహా అపోహలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రపంచంలో జరిగిన ప్రతి ఆవిష్కరణను అందిపుచ్చుకునే సామర్థ్యం భారత్'కు ఉంది అని చెప్పారు.
పాత తరాల వారితో పోలిస్తే యువత చురుగ్గా ఉన్నారన్నారు.

# భారత వృద్ధి రేటు 7 శాతం.....!



భారత ఆర్థిక వఅద్ధి రేటు అంచనాలను ఐక్యరాజ్య సమితి సవరిస్తూ దాదాపు 7 శాతానికి పెంచింది. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు వినిమయం పెరగడమే అందుకు కారణమని తెలిపింది. 2024లో భారత్ 6.9 శాతం, 2025లో 6.6 శాతం వఅద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. బహిర్గత డిమాండ్ తక్కువగా ఉంటుందని.. దీనివల్ల సరుకుల ఎగుమతిలో వఅద్ధి దెబ్బతింటుందని తెలిపింది.
అదే సమయంలో ఔషధ, రసాయన ఎగుమతులు బలంగా పుంజుకుంటాయని పేర్కొంది. జనవరిలో 2024 భారత వఅద్ధిరేటును ఐరాస 6.2 శాతంగా పేర్కొంది. దాన్ని ఇప్పుడు 0.7 శాతం పెంచడం విశేషం. 2025 అంచనాలను మాత్రం సవరించలేదు. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2023 నాటికి 5.6 శాతం నుంచి 2024లో 4.5 శాతానికి దిగొస్తుందని ఐరాస నివేదిక అంచనా వేసింది. దక్షిణాసియా ప్రాంతవ్యాప్తంగా ఇదే ధోరణి ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణం గరిష్ఠంగా ఇరాన్‌లో 33.6 శాతం, మాల్దీవుల్లో అత్యల్పంగా 2.2 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. బంగ్లాదేశ్, భారత్‌లో ఆహారపదార్థాల ధరలు కొంత తగ్గినప్పటికీ.. ఇంకా అధిక స్థాయుల్లోనే ఉన్నాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2024లో 2.7 శాతం, 2025లో 2.8 శాతం వఅద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. 2024 అంచనాలను 0.3 శాతం పెంచడం విశేషం. అమెరికా సహా బ్రెజిల్, భారత్, రష్యా వంటి వర్ధమాన దేశాల్లో బలమైన వఅద్ధే అంచనాలను పెంచడానికి దోహదం చేసిందని తెలిపింది.

# మోటారొలా నుంచి కొత్త గాడ్జెట్...



మార్కెట్లోకి కొత్త గాడ్జెట్ వస్తూ అలరిస్తూ ఉంటాయి. లేటేస్ట్ గా మోటారొలా కంపెనీ నుంచి 'మోటో ఎడ్జ్ 50'ని మే 16న విడుదల చేయశారు. 5జీ నెట్ వర్క్ కు ఉపయోగపడే ఈ మొబైల్ అప్డేట్ టెక్నాలజీతో పాటు కొత్త ఫీచర్లను అమర్చారు. భారత్ లో అందుబాటులో ఉన్న ఈ ఫోన్ వివరాల్లోకి వెళితే..మోటో ఎడ్జ్ 50 ఫ్యూజియన్ చూడ్డానికి ఆకర్షణీయంగా ఉంటుంది. లైట్ వెయిట్ తో ఉన్న ఈ మొబైల్ చాలా సన్నగా ఉంటుంది. మోటారోలా ఇప్పటి వరకు రిలీజ్ చేసిన వాటిలో ఇదే సన్నగా ఉంటుందని తెలుస్తుంది. మటారోలా ఎడ్జ్ ఫ్యూజన్ 6 నుంచి 7 అంగుళాల హెచ్ డీ 3 డీ కన్వర్టెడ్ డిస్ ప్లే తో పాటు హై రిఫ్రెష్ రేట్ 144 హెచ్ జెడ్ 1600 నిట్స్ బ్రైట్ నెస్ ను కలిగి ఉంది. దీని స్క్రీన్ రిఫ్రెస్ రేట్ 144 హెచ్ జడ్ ఆండ్రాయిడ్ 14 ఓఎస్ ఆధారితమైన ఈ మొబైల్ 4 ఎన్ఎం స్నాప్ డ్రాగన్ 7 ఎస్ జెన్ 2 ప్రాజెస్ పనిచేస్తుంది. ఈ మొబైల్ కెమెరా విషయానికొస్తే 50 మెగా పిక్సల్ కలిగిన ప్రధాన కెమెరా ఉంది. అలాగే ఇందులో సోనీ ఎల్ వైటీ 700 సీ సెన్సార్, 1.88 అసెర్చర్ ను అమర్చారు. అలాగే ఇందులో 256జీబీ స్టోరేజ్ ఉంటుంది. ఈమొబైల్ 5 జీతో పాటు 4 జీ నెట్ వర్క్ ను కలిగి ఉంది. ఎల్ టీటీఈ వైఫై 6 , బ్లూటూత్ కనెక్టివిటీ వంటి ఆప్షన్లు ఉన్నాయి. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 ద్వారా డిస్ ప్లేను కలిగిన దీనిలో 7 ఎస్ జనరేషన్ 2 చిప్ సెట్ తో మల్టీ టాస్కింగ్ ను కలిగి ఉంది. ఈ మొబైల్ 3 కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ధర లోకి వెళ్తే 8 జీబీ ప్లస్ 128 జీబీ వేరియంట్ ను రూ.22,999 తో విక్రయిస్తున్నారు. దీనిని మొత్తం అమౌంట్ తో కాకుండా క్రెడిట్ కార్డు ద్వారా కూడా కొనుగోలు చేయొచ్చు. ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేస్తే రూ.2 వేల ఆఫర్ లభిస్తున్నది. ఫ్లిఫ్ కార్డు ద్వారా పాత ఫోన్ ఎక్చేంజ్ ద్వారా కొనుగోలు చేస్తే రూ.2 వేల తక్కువకే వస్తుంది.
మటారోలా ఎడ్జ్ ఫ్యూజన్ 6 నుంచి 7 అంగుళాల హెచ్ డీ 3 డీ కన్వర్టెడ్ డిస్ ప్లే తో పాటు హై రిఫ్రెష్ రేట్ 144 హెచ్ జెడ్ 1600 నిట్స్ బ్రైట్ నెస్ ను కలిగి ఉంది. దీని స్క్రీన్ రిఫ్రెస్ రేట్ 144 హెచ్ జడ్ ఆండ్రాయిడ్ 14 ఓఎస్ ఆధారితమైన ఈ మొబైల్ 4 ఎన్ఎం స్నాప్ డ్రాగన్ 7 ఎస్ జెన్ 2 ప్రాజెస్ పనిచేస్తుంది. ఈ మొబైల్ కెమెరా విషయానికొస్తే 50 మెగా పిక్సల్ కలిగిన ప్రధాన కెమెరా ఉంది. అలాగే ఇందులో సోనీ ఎల్ వైటీ 700 సీ సెన్సార్, 1.88 అసెర్చర్ ను అమర్చారు.

# మోసగాళ్లతో జీఎస్టీ అధికారుల కుమ్మక్కు....




ప్రభుత్వ కార్యాలయాలు అంటే సామాన్యులు జంకుతున్నారు. ఏదైనా పనికోసం దరఖాస్తు చేస్తే రోజులు..నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి చివరకు కొర్రిలు పెట్టి ఈ పనికాదని ఖరాకండిగా చెబుతున్నారు. ఇది సాధారణంగా ప్రభుత్వ అధికారులు తీరు ఇలాగా ఉంటుంది..కానీ కొందరు మాత్రం దరఖాస్తుదారుల నుంచి ఆమ్యామ్యాలు స్వీకరించి ఎంతటి పనినైనా క్షణాల్లో చేసిపెడుతున్నారు. ఇది ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగేతంతు కానీ, జీఎస్టీ కార్యాలయాల్లో కూడా ఇదే సీన్ రిపీటైంది.
అక్రమ పద్దతిలో జీఎస్టీ రిఫండ్‌ను కొట్టేయాలనే ఉద్దేశంతో వ్యాపారి ఆడిన నాటకం బట్టబయలు అయింది. జీఎస్టీ రిఫండ్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్న నిమిషంలోనే బ్యాంక్ ఖాతాలో రూ.2 కోట్లు డిపాజిట్ కాగా, మరో పది నిమిషాల్లో మరో రూ.3 కోట్లు జమయ్యాయి. జీఎస్టీ రిఫండ్‌కు సంబంధించిన కుంభకోణం బయటకు తేవడంలో ఈ లావాదేవీలే కీలకంగా మారాయి. విద్యుత్‌తో నడిచే ద్విచక్ర వాహనాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను ఆసరాగా చేసుకొని ఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మను అడ్డంగా పెట్టుకొని అటు వ్యాపారులు, ఇటు జీఎస్టీ ఉన్నతాధికారులు కోట్ల రూపాయల రిఫండ్ కుంభకోణానికి పాల్పడ్డారు. మెడికల్ వ్యాపారం నిర్వహిస్తున్న రమేశ్ రెడ్డికి సంబంధించిన ఈ-బైక్‌ల తయారీ సంస్థకు రావాల్సిన రూ.5 కోట్ల జీఎస్టీ రిఫండ్ నిలిచిపోయింది.
ఈ రిఫండ్ కోసం రంగంలోకి దిగిన చిరాగ్ శర్మ..జీఎస్టీ ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చి వెంటనే విడుదల చేయించారు. ఇక్కడే అధికారులకు, చిరాగ్ శర్మకు మధ్య మనీ బంధం ఏర్పడింది. ఇటీవల అరస్టైన అధికారులతో చేతులు కలిపిన చిరాగ్ శర్మ.. జీఎస్టీ రిఫండ్‌తోపాటు కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్, జీఎస్టీ నంబర్లు, ఫైలింగ్ చేయిస్తూ తమ అక్రమ దందాను కొనసాగించారు. ఈ క్రమంలో తమ అక్రమ దందాకు అడ్డువచ్చిన అధికారులను సైతం బెదిరించడానికి సైతం వెనుకాడలేదు. హైదరాబాద్‌లో రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న నకిలీ ఈ-బైకుల తయారీదారుడికి మాత్రం రిఫండ్‌కు సంబంధించిన దాంట్లో ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై రంగంలోకి దిగిన చిరాగ్ శర్మ రంగంలోకి జీఎస్టీ ఉన్నతాధికారితో మాట్లాడిన పని కాలేదు.ఈ ఫైల్‌ను వెంటనే తనకు నమ్మిన అధికారి విధులు నిర్వహిస్తున్న నల్గొండకు బదిలీ చేయించుకున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే తిరిగి ఆ ఫైల్స్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో అనుమానం వచ్చిన జీఎస్టీ అధికారి ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు.

# విమాన ప్రయాణీకుల రద్దీ పెరిగింది...!



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా విమాన ప్రయాణీకుల రద్దీ 40.7-41.8 కోట్లకు చేరుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అదే సమయంలో విమాన సంస్థల ఆదాయాలు 15-17 శాతం పెరుగుతాయని చెప్పింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధీనంలోని విమానాశ్రయాలతోపాటు ఢిల్లీ, హైదరాబాద్, కోచి అంతర్జాతీయ విమానాశ్రయాలను నమూనాగా తీసుకుని ఇక్రా ఈ నివేదిక విడుదల చేసింది. ఇక్రా నివేదిక ప్రకారం కరోనా కంటే ముందు నమోదైన విమాన ప్రయాణాలతో పోలిస్తే 10 శాతం అధికంగా ఫ్లైట్‌జర్నీ చేస్తున్నారు. మార్చి 2024 తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 37.6 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారు. విమానాల రద్దీ ఏటా 8-11 శాతం పెరుగుతోంది. 2023 క్యాలెండర్ ఏడాదిలో అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీలో భారత్ వాటా 4.2 శాతంగా ఉంది. 2019లోని 3.8 శాతంతో పోలిస్తే అధికం. 2023లో గ్లోబలగా ప్రయాణికుల రద్దీ 96 శాతం పుంజుకుంది. అదే భారత్‌లో మాత్రం 106 శాతం రికవరీ అయింది.

# విదేశీ ఇన్వెస్టర్లకు 'ఎన్‌డిఎ' భయాలు




భారత్‌లో ఎన్‌డిఎ ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవచ్చనే అంచనాలు విదేశీ ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెరిగాయి. దీంతో ఇక్కడి స్టాక్ మార్కెట్లలోని ఈక్వీటీల్లోని పెట్టుబడులను పెద్ద సంఖ్యలో ఉపసంహరించుకుంటున్నారు. ఎన్నికల రిస్కుల ఆందోళనతో కేవలం ఒక్క నెలలలోనే అంటే మేలో ఇప్పటి వరకు 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30వేల కోట్ల) పెట్టుబడులను గ్లోబల్ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. జూన్ 2023 తర్వాత ఇవే అత్యధిక ఉపసంహరణలు అని వెల్లడించింది. ఇక్కడి పెట్టుబడులను చైనాకు తరలించుకుపోతున్నారని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ తక్కువ ప్రగతి, కీలకమైన ఆర్థిక సంస్కరణలను చేపట్టే అతని సామర్థ్యం పరిమితి తగ్గుతుందనే అంచనాల్లో భారత ఈక్విటీ మార్కెట్లు అనిశ్చిత్తిని ఎదుర్కొంటున్నాయని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. "భారత్‌లో ప్రస్తుత ఎన్నికల చుట్టూ ఉన్న రిస్కులు పెరిగాయి. అయితే చైనాలో ప్రతికూలత భయపడినంత ఏమి లేదనే సంకేతాలు ఉన్నాయి." అని న్యూయార్క్‌లోని ఏరియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సిలో పోర్ట్‌ఫోలియో మేనేజర్ క్రిస్టీన్ ఫిల్‌పాట్స్ పేర్కొన్నారు. భారత్‌లో జూన్ 1న పోలింగ్ ముగియనుంది. జూన్ 4న ఓట్లను లెక్కించనున్న విషయం తెలిసిందే.
జూన్ 2023 తర్వాత ఇవే అత్యధిక ఉపసంహరణలు అని వెల్లడించింది. ఇక్కడి పెట్టుబడులను చైనాకు తరలించుకుపోతున్నారని తెలిపింది.

# ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తాం





**ఖమ్మం:** ఖమ్మం రూరల్ మండల పర్యటన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచినా. తెలంగాణాలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం. ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం. గ్రామంలో ఉన్న పాఠశాల,రోడ్లు,కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేపిస్తాం. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తాం. పాలేరు నియోజకవర్గం నా సొంత ఇల్లు. ఎన్నికల కోడ్ అయిపోగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలవుతాయి. అడిగిన సమస్యలే కాకుండా అడగని సమస్యలు కూడా పరిష్కరిస్తా. ప్రజలు అడిగిన కోరికలు తీర్చే బాధ్యత నాది. భవిష్యత్ లో ఏ సమస్య వచ్చినా ఇందిరమ్మ కమిటీ ద్వారా నాకు తెలియచేయండి. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మీ పెద్ద కొడుకు గా పనిచేస్తానని అన్నారు.

# హస్తగతమయిన నార్సింగి మునిసిపాలిటీ

**రంగారెడ్డి జిల్లా:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు నార్సింగి మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ పార్టీ నేతలు హస్త గతం చేసుకున్నారు. ఇటీవలే నార్సింగి బిఆర్ఎస్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ లపై 12 మంది కౌన్సిలర్ లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఆర్డిఓ వెంకటరెడ్డి నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లు ఉండగా క్యాంపు నుండి నేరుగా వచ్చిన 10 మంది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, 2 బిజెపి కౌన్సిలర్లు,2 ఇతర కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు. 4 మంది బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి గైహాజరయ్యారు. దీంతో బీ ఆర్ ఎస్ పార్టీ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ లు తమ స్థానాలు కోల్పోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లుగా ఆర్డిఓ వెంకట్ రెడ్డి మీడియాకు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అతి త్వరలో చైర్పర్సన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక ఉంటుందని ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు..

# కలుషిత నీరు త్రాగి అస్వస్థత



**అదోని:** కర్నూలు జిల్లా ఆదోని మండలం ఇస్వి గ్రామంలో కలుషిత నీరు తో 30 మందికి పైగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.. గ్రామంలో గత వారం రోజుల నుంచి త్రాగునీరు ఎర్ర రంగుతో వస్తున్నాయంట గ్రామస్తులు తెలిపారు.. కలుషిత నీరు తాగి వాంతులు విరోచనాలతో 30 మందికి పైగా ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. అతిసార తో 30 మందికి పైగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# అగ్రికల్చర్ టాప్ 10 వీరే




**హైదరాబాద్:** టీఎస్ ఎప్‌సెట్ –2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి కలిసి విడుదల చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 89.66 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో అమ్మాయిలో 90.18 శాతం, అబ్బాయిలు 88.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 91,633 మంది విద్యార్థులు హాజరు కాగా, 82,163 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో టాప్ టెన్‌లో ముగ్గురు అమ్మాయిలు నిలిచారు. తొలి ర్యాంకర్ ఆలూరు ప్రణీత. ఆమె ఏపీకి చెందిన విద్యార్థిని.అగ్రికల్చర్, ఫార్మసీలో టాపర్స్..1. ఆలూరు ప్రణీత అన్నమయ్య జిల్లా, ఏపీ2. నగుదశారి రాధాకృష్ణ విజయనగరం 3. గడ్డం శ్రీ వర్షణి వరంగల్ 4. సోమ్‌పల్లి సాకేత్ రాఘవ్ చిత్తూరు5. రేపాల సాయి వివేక్ గోల్కొండ, హైదరాబాద్6. మహ్మద్ అజాన్ సాద్ ? మేడ్చల్ మల్కాజ్‌గిరి7. వడ్లపూడి ముఖేశ్ చౌదరి ? తిరుపతి8. జెన్ని భార్గవ్ సుమంత్ ? కుత్బుల్లాపూర్9. జయశెట్టి ఆదిత్య ? కూకట్‌పల్లి, హైదరాబాద్10. పూల దివ్య తేజ ? శ్రీ సత్యసాయి జిల్లా, హైదరాబాద్

# ఇక పంచాయతీ పోరు

**- పెరిగిన ఆశావాహుల సందడి**

**- సిద్ధమవుతున్న నాయకులు,యువత రిజర్వేషన్లపై సమాలోచనలు**




**నాగర్ కర్నూల్:** పల్లెల్లో పంచాయితీ ఎన్నికల వేడి మొదలైంది. ఆశావహుల సందడి పెరిగింది. ఇటీవలే పార్ల మెంటు ఎన్నికలు జరగగా రాబోయేవి గ్రామ పంచాయతీ ఎన్నికలే కావడంతో అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో సహకరించిన నాయకులకు ప్రస్థుతం ఎన్నికల్లో అవకాశాలు లభించనున్నాయి. పంచాయితీ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లలో ఉన్నారు. ఏనమయంలో నైనా నోటిఫికేషన్ వస్తుందనే ఆలోచనలో అధికారులు సిద్ధమై యడంతో ఉన్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగియడంతో జూన్ 4వ తేదీన ఫలితాలు విడుదల కానున్నాయి. ఆ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా పచ్చజెండా ఊపి ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తుంది. జూన్ చివరివారం లో గ్రామ ప్రథమ పౌరుడి ఎన్నిక కోసం ఎలక్షన్ జరిగే అవకాశం ఉంది. అలాగే జులై మాసం చివరి కల్లా జడ్పిటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సైతం ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

**సిద్దమవుతన్న నాయకులు, యువత**

స్థానిక సంస్థల ఎన్నిల కోసం గ్రామీణ. ప్రాంతాల నాయకులు. యువకులు ఇప్పటి నుంచె సమాలోచనలు చేస్తున్నారు.ఏ గ్రామంతో ఏ రిజర్వేషన్ వస్తుందోనని సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు. పాత రిజర్వేషన్ ఉంటుందా.లేదా, మార్పు తుండా అని బేరీజు వేసు కుంటున్నారు. వారీగా రిజ ర్వేషన్ల ఎవరైతే బాగుంటుదోనని పేర్లను ఖరారు చేసే పనిలో పార్టీల నాయకత్వం కూడా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటి నుంచే ఆశావాహులు రంగంలోకి దిగుతున్నారు. ఆర్థికంగా ఉన్న నాయకులను నిలబెట్టేందుకు పార్టీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. లింగాల మండలంలో 23 పంచాయితీలు ఉన్నాయి.గత ఎన్నికల్లోరెండు మూడు మినహ అన్నీ అప్పుడు అదికారంలో ఉన్న బిఆర్ఎస్ఎ?పర్టీ కైవసం చేసుకోగా, ప్రస్తుతం పంచాయితీల్లో అధికారుల పాలన కొనసాగుతుంది.

**అధికారపార్టీ మద్దతు ఉంటేనే గెలుపు**

రాష్ట్రంలో అధికారంలో ఉన్నపార్టీ మద్దతు ఉంటేనే గెలువు సాధ్యమవుతుందని, ఆపార్టీ నుంచే టికెట్ పొందేందుకు ఆశావాహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యక్తి ముఖ్యమని, పార్టీ కాదని.

**గ్రామపంచాయతి కార్యాలయము**

మరికొందరు వాదిస్తున్నారు. ఏ పార్టీ తరపున ఎవరికి పోటీ ఉంటుందో ఇప్పటి నుంచే గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. జూన్ చివరి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటున్నాయని" సిఎం రేవంత్ ప్రకటించటంతో పల్లెల్లో ఇప్పటి నుండి ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మరి కొందరు రిజర్వేషన్ అనుకూలిస్తే సర్పంచ్ నీకు, ఎంపీటీసీ నాకు అంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ఏదీ ఏమైనా పార్లమెంట్ ఎలక్షన్ ముగిసిన వెంటనే స్థానిక సంస్థల సమరం ఉండడంతో గ్రామాల్లో ఓటర్లకుఇక పండగేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# భీమవరం కేంద్రంగానే రూ. 150 కోట్లు

**ఏలూరు:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ముగిసింది. జూన్ 4న ఫలితాలను ప్రకటించనున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో పోలింగ్ నమోదయింది. దీంతో ఎవరికి వారే ప్రయోజనాలను అన్వయించుకుంటున్నారు. అయితే మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగులు జోరుగా కొనసాగుతున్నాయి. కోట్లాది రూపాయల పందేలు సాగుతున్నాయి. అధికార వైసిపి కంటే.. కూటమి అధికారంలోకి వస్తుందని అంశంపైనే ఎక్కువ మంది బెట్టింగ్ కాస్తున్నారు. ఒకవేళ కూటమి ఓడిపోతుందని ఎవరైనా పందెం కాసి నెగ్గితే వారికి రూపాయికి నాలుగు రూపాయలు చొప్పున ఇచ్చేందుకు సైతం వెనుకడుగు వేయడం లేదు. అయితే మనం గెలవబోతున్నాం అంటూ సీఎం జగన్ ప్రకటన చేసిన తర్వాత కూడా.. వైసీపీ శ్రేణుల నుంచి ధీమా కనిపించడం లేదు.వాస్తవానికి పందేలు చట్ట విరుద్ధం. కానీ ఏపీలో గెలుపోటములపై బహిరంగంగానే బెట్టింగులు సాగుతున్నాయి. ఒక్క భీమవరం కేంద్రంగానే 150 కోట్ల రూపాయల బెట్టింగులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అక్కడ వైసీపీ పై బెట్టింగ్ వేసే వారు తక్కువగా ఉన్నారు. ఆ పార్టీ గెలుస్తుందని ఎవరు ముందుకు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై ఎక్కువగా బెట్టింగ్ కొనసాగుతోంది. చంద్రబాబు, జగన్, లోకేష్, పవన్, బాలకృష్ణ, రఘురామకృష్ణం రాజు, షర్మిల, కొడాలి నాని, వల్లభనేని వంశీ వంటి వారి నియోజకవర్గాల విషయంలో.. ఏ పార్టీ గెలుస్తుంది? ఏ పార్టీకి అంత మెజారిటీ వస్తుంది? అన్నదానిపై బెట్టింగులు కొనసాగుతున్నాయి. అయితే ఏపీలో కూటమికి అనుకూల పవనాలు ఉండడంతో.. ఎక్కువగా వైసీపీకి వ్యతిరేకంగా బెట్టింగులు సాగుతుండడం విశేషం.అయితే ఈ బెట్టింగ్ల తీరు




ఎప్పటికప్పుడు మార్పు వస్తోంది. వాస్తవానికి ఎన్నికల నోటిఫికేషన్ ముందు ఒకలా.. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మరోలా.. ప్రచారపర్వం ప్రారంభమైన తర్వాత ఇంకోలా.. పోలింగ్ తర్వాత మరోలా బెట్టింగ్ పర్వం కొనసాగడం విశేషం. ఫిబ్రవరి మొదట్లో వైసీపీకి 60 సీట్లు వస్తాయంటూ పందేలు మొదలయ్యాయి. కానీ ప్రచారం ముగిసే సమయానికి ఆ సంఖ్య 75 కు చేరింది. పోలింగ్ తర్వాత 70కి మించి సీట్లు రావని ఎక్కువ మంది బెట్టింగ్ కడుతున్నారు. మరోవైపు కూటమిలో తెలుగుదేశం పార్టీకే 89 నుంచి 92 సీట్లు వస్తాయని.. కూటమికి 104 నుంచి 107 సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎక్కువ శాతం పందేలు కొనసాగుతున్నాయి. గెలుస్తున్నామని జగన్ ప్రకటన తర్వాత కూడా వైసీపీ నుంచి ఆ స్థాయిలో పందేలకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

# అంగరంగ వైభవంగా మొదలైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**- చేరినాడు చూడరో... లక్ష్మి నరసింహుడుఅత్తారింటి నుంచి కోనకు పెంచలస్వామి**

**- గిరిజనవాడలో అంబరాన్నంటిన సంబరాలు**

**- నవ వధూవరులకు గిరిజనుల సారెఉత్సవాల అనంతరం తిరిగి అత్తారింటికి**



**బద్వేలు:** గోనుపల్లి, గోనుపల్లి గిరిజన వాడలు గోవింద, పెంచల నామస్మరణలతో మారుమోగాయి. తప్పెట్లు,తాళాలు, బాజాభజంత్రీల నడుమ ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహుడు బ్రహ్మోత్సవాలు చేసుకునేందుకు అత్తారింటి నుంచి కోనకు పయనమయ్యారు.తొలుత గోనుపల్లి గ్రామంలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మి అమ్మవారి ఇంటికి (గిరిజనవాడ)కు చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గిరిజనవాడలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు.వాడలోని ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పందిళ్లు, ముగ్గులు వేసి వధూవరులకు ఘన స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకున్న నవవరుడిని (శ్రీవారిని) చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు గిరిజనవాడకు చేరుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వదూవరులను గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేకంగా ఆలంకరించిన పల్లకిలో దేవేరులతో కలిసి కొలువుదీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. ఆనంతరం బోయలు పల్లకి మోసుకుంటూ ఆరు కి.మీ కాలినడకన కోనకు వేయ నమయ్యారు. సహజ సిద్ధమైన చల్లని వాతావరణంలో కొద్ది దూరం, ట్యాంకర్లతో పట్టిన నీటితో చల్లబడ్డ రోడ్డుపై మిగిలిన దూరం వందలాది మంది భక్తులతో శ్రీవారు కోనకు చేరారు. ఆలయ ఈవో విజయ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ లో టాప్ టెన్ వీరే



**హైదరాబాద్ :** టీఎస్ ఎప్‌సెట్ –2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి కలిసి విడుదల చేశారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 74.98 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో అమ్మాయిలు 75.85 శాతం, అబ్బాయిలు 74.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,80,424 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఇంజినీరింగ్‌లో టాపర్స్1. సతివాడ జ్యోతిరాధిత్య ? శ్రీకాకుళం2. గొల్లలేఖ హర్ష ? కర్నూల్3. రిషి శేఖర్ శుక్లా ? సికింద్రాబాద్4. భోగలపల్లి సందేశ్ ? మాదాపూర్, హైదరాబాద్5. మురసాని సాయి యశ్వంత్ రెడ్డి ? కర్నూల్6. పుట్టి కుశాల్ కుమార్ ? అనంతపూర్ 7. హుందేకర్ విదిత్ ? రంగారెడ్డి8. రోహన్ సాయి పబ్బ ? ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్9. కొణతం మణితేజ ? వరంగల్10. ధనుకొండ శ్రీనిధి ? విజయనగరం

# రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుస్తుంది

**- కేంద్రమంత్రి,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి**




**యాదాద్రి:** రాష్ట్రంలో బిజెపికి అనుకూలమైన పరిస్థితులున్నాయి. దేశంలో మేదావులు ,విద్యావంతులు బిజెపికి అండగా ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సమాయత్త సమావేశంలో అయన మాట్లాడారు. కేసీఆర్ పై ఉన్న వ్యతిరేకతోనే కాంగ్రెస్ అధికారం లోకి వచ్చింది. ఇచ్చిన హామీలను అమలు చేసే శక్తి రేవంత్ రెడ్డికి లేదు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు పార్టీ లో ఉండే పరిస్థితి లేదు. తెలంగాణ లో కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయనీగా బిజెపి ఎదుగుతుంది. గెలిచిన ఎమ్మెల్యేలనే కాపాడుకోలేని కేసీఆర్ ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు. తెలంగాణలో బిజెపి అత్యధిక ఎంపీ స్థానాలు గెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకై ప్రజల పక్షాన బిజెపి పోరాడుతుంది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ పట్టభద్రులు బిజెపి వైపే ఉన్నారని అన్నారు.

# గ్రామాన్ని సందర్శించిన డీ ఎల్ పి ఓ వెంకటయ్య



**నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా లోని లింగాల మండల పరిధిలోని రాంపూర్ గ్రామాన్ని అచ్చంపేట నియోజక వర్గ డి ఎల్ పి ఓ వెంకటయ్య సందర్శించి గ్రామం సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు. గుంతలు తీశారు– పొడిచేది మరిచారు. అనే వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ ,డి పి ఓ కృష ఆదేశాల మేరకు డి ఎల్ పి ఓ వెంకటయ్య రాంపూర్ గ్రామం చేరుకుని గ్రామం లో వీదుల గుండ తిరిగీ సమస్యలు తెలుసుకున్నారు. గుద్దలు తీశారు కూడిచేది పరిచారు అనే వార్త చూసిన వెంటనే పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ స్పందించి అట్టి గుంతలు పూడి చేశారు.అదే విధంగా రాంపూర్ స్టేజి దగ్గర వాటర్ ట్యాకు దగ్గర ఓవర్ ఫుల్ వాటర్ వ్యవసాయ పొలాలకు వాడుతున్నారని డిఎల్పిఓ దృష్టికి అట్టి వాటర్ వాళ్లు వాడకుండా నేరుగా కుంటలోకి వెళ్లే విధంగా ప్రీడలు ఛానల్ తీసి కుట్టలోకి వెళ్లే విధంగా చూడాలని పంచాయతి కార్యదర్శికి గ్రామ ప్రజలకు ఆదేశించారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ దగ్గర కూడా ఓవర్ ఫుల్ వాటర్ ట్యాంక్ దగ్గర చేరకుండా నేరుగా కుంటలోకి వెళ్లే విధంగా కాలువ తీయాలని ఆదేశించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com